RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 136 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం,నవంబర్,19,2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 136 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday,November,19,2025 | PAGES : 8 RS : 4 /- |



తెలంగాణను వణికిస్తున్న

## తీవ్రమైన చలి

- ఆసిఫాబాద్ జిల్లాలో 7 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- మరో మూడు రోజుల పాటు కొనసాగనున్న చలిగాలులు
- గతేడాదితో పోలిస్తే గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్రంపై చలిపులి పంజా విసురుతోంది. రాజధాని హైదరాబాద్‌తో పాటు అనేక జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలు చలికి గజగజ వణికిపోతున్నాయి. చాలా ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదవుతున్నాయి. ఆదివారం రాత్రి కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో అత్యల్పంగా 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.1 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఆదిలాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, నిర్మల్ సహా పలు జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 8 నుంచి 10 డిగ్రీల మధ్య నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో అక్కడి ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతేడాది ఇదే సమయానికి రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 12.1 డిగ్రీలుగా నమోదు కావడం గమనార్హం. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్రంలో చలి తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అన్ని జిల్లాల్లో సగటున 8.6 నుంచి 13.5 డిగ్రీల మధ్య కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈ క్రమంలో రాష్ట్రమంతటికీ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.




దేశానికి పెద్దన్నగా నరేంద్ర మోదీ సహకరిస్తే

అన్ని రాష్ట్రాలు అభివృద్ధి

## చెందుతాయి

- తెలంగాణ ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరిన ముఖ్యమంత్రి
- ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్న రేవంత్ రెడ్డి
- ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందన్న సీఎం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలుఅభివృద్ధి చెందుతాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ ఐటీసీ కోహినూర్ లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకమవుతుందని అన్నారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు ఇక్కడ మరో కొత్త నగరాన్ని నిర్మించాలని చూస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలని, మిగతా సమయాల్లో పరస్పరం సహకారంతో అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు మోదీ నేతృత్వంలోని కేంద్రం కృషి చేస్తోందని, ఈ క్రమంలో కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందని అన్నారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. కేంద్రం 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీని నిర్దేశించుకుందని, అందు లో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలని భావిస్తున్నట్లు చెప్పారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్రం సహకారం ఉండాలని కోరారు. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించినట్లే తాము తెలంగాణ మోడల్ తీసుకువచ్చామని, కాబట్టి తన రాష్ట్రానికి ఇచ్చిన సహకారం తమకూ ఇవ్వాలని అన్నారు. మోదీ సబర్మతి ప్రక్షాళన చేసినట్లుగా తాము మూసీని చేస్తున్నామని అన్నారు.



రోజుకు 12 గంటలు..

6 రోజులు పని చేస్తేనే

## బాగుపడతాం

ఇన్ఫోసిస్ నారాయణమూర్తి

**ఢిల్లీ,:** దేశంలోని రెండవ అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్. దీని వ్యవస్థాపకుల్లో ఒకరైన నారాయణ మూర్తి యువత ఎక్కువ పనిచేయాలి, వారానికి 70 గంటలు కష్టపడాలి అని చెప్పిన మాటలు దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలతో పాటు సానుకూలత చూసిన సంగతి తెలిసిందే. ఎవ్వరుఎన్ని అన్నా మూర్తిమాత్రం తన మాటపై తాను నిలబడుతూనే ఉన్నారు. దేశం కోసం యువత కష్టపడాల్సిందేనని చైనాలోని పని విధానాన్ని తాజాగా ఉదహరించారు. తాజాగా ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ భారత యువత కష్టపడి, ఎక్కువ పని చేస్తేనే దేశం వేగంగా ఎదగగలదని వ్యాఖ్యానించారు. ఇది మరోసారి దేశవ్యాప్తంగాచర్చకు దారితీస్తోంది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిన చైనా 9-9-6 పని సంస్కృతిని ఈ సందర్భంగా మూర్తి ఉదహరించారు. చైనాలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు.. వారంలో 6 రోజుల పనిచేసే విధానం అమలులో ఉంది. అంటే ఈ లెక్కన వారానికి వారు 72 గంటల పనిచేస్తారు. ఇది మూర్తి 2023లో సూచించిన వారానికి 70 గంటల పని విధానానికి దగ్గరగా ఉంది. ప్రస్తుతం భారత్ అభివృద్ధి చెందాలంటే ఇక్కడి యువత కూడా చైనాలో మాదిరిగా ఎక్కువ గంటల పాటు కష్టపడాలని అన్నారు.







మారేడుమిల్లిలో..

## ఎదురుకాల్పులు

ఒడిషా బార్డర్‌లో ఎన్ కౌంటర్
హిడ్మాతో పాటు మరోనలుగురు సైతం
మృతుల్లో హిడ్మా భార్య కూడా

**మారేడుమిల్లి,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్- ఒడిషా సరిహద్దులోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఎన్‌కౌంటర్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఈఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, మావోయిస్టు పార్టీ యాక్షన్ టీం కార్యదర్శి హిడ్మా ఉన్నట్లుగా సమాచారం. ఐదుగురు మావోయిస్టు మృతదేహాలను గుర్తించిన పోలీసులు ఇందులో హిడ్మాతో పాటు ఆయన సతీమణి కూడా ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. అగ్రనేతల్లో కొంతమంది ఇప్పటికే మృతి చెందగా మరికొంతమంది ఇటీవల లొంగిపోయిన విషయం తెలిసిందే. హిడ్మా మాత్రం మావోయిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకే నిర్ణయించుకుని అడవుల్లోనే ఉండిపోయాడు. ఈ నేపథ్యంలో హిడ్మాను లొంగిపోవాలని కోరుతూ ఇటీవల చత్తీస్‌గడ్ హోంమంత్రి స్వయంగా చత్తీస్‌గడ్‌లోని ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను కోరాడు. అయినా లొంగుబాటుకు సంబంధించి ఎలాంటి సానుకూల ప్రకటన ఆయన్ను రాలేదు. మరో వైపు హిడ్మాను అదుపులోకి తీసుకునేందుకు కూంబింగ్ బృందాలు ప్రయత్నాలను ముమ్మరం చేయగా హిడ్మా ఎన్‌కౌంటర్ అయినట్లుగా వార్తలు రావడం గమనార్హం. ఈ విషయంపై పోలీసుల నుంచి ధ్రువీకరణ కాలేదు.

చిన్న పిల్లల మిస్సింగ్ కేసులు

దత్తత నిబంధనలు సరళీకరించాలని

## సుప్రీం సూచన

**న్యూఢిల్లీ,నవంబరు18 :** ఇటీవల పలు రాష్ట్రాల్లో చిన్నారుల మిస్సింగ్ పై మీడియాలో వార్తలు సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో చిన్నారుల మిస్సింగ్‌పై న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ఎనిమిది నిమిషాలకొక చిన్నారి మిస్ అవుతున్నారనే వార్తలు వస్తున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న తెలిపారు. ఈ క్రమంలో దత్తత నిబంధనలు సరళీకృతం చేయాలని సూచించారు. పిల్లల దత్తత నిబంధనలు కఠినతరంగా ఉండటం వల్ల అక్రమ పద్ధతుల్లో దత్తత తీసుకుంటున్నారని వ్యాఖ్యానించారు నాగరత్న. చిన్నారుల మిస్సింగ్ అంశంపై జిల్లాకు ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని గత విచారణలో సూచించింది సుప్రీంకోర్టు. తెలంగాణలో అక్రమ దత్తత వ్యవహారంలో పలు కేసులు బయటకు వచ్చాయని న్యాయవాది గుర్తుచేశారు. ఈ విషయంపై అన్ని రాష్ట్రాలతో సమావేశాలు నిర్వహించేందుకు కొంత సమయం ఇవ్వాలని కోరారు అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి.



బీఆర్ఎస్ ఓటమి, కొత్త పార్టీ ఏర్పాటుపై

## కవిత కీలక వ్యాఖ్యలు

- బీఆర్ఎస్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదన్న కవిత
- కుట్ర చేసి తనను పార్టీ నుంచి బయటకు పంపారని ఆరోపణ
- ప్రస్తుతానికి కొత్త పార్టీ ఆలోచన లేదని వెల్లడి
- తుమ్మల వంటి నేతను వదులుకోవడం వల్లే బీఆర్ఎస్ అధికారానికి దూరమైందని విశ్లేషణ
- భవిష్యత్తులో తామే బాధ్యతాయుత ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని ప్రకటన

**ఖమ్మం,తెలంగాణ దిశ :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్ పార్టీపై, తన రాజకీయ భవిష్యత్తుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్‌తో తనకు ఇప్పుడు ఎలాంటి సంబంధం లేదని, కుట్రపూరితంగా తనను, తన కుటుంబాన్ని పార్టీకి దూరం చేశారని ఆరోపించారు. ప్రస్తుతానికి కొత్త రాజకీయ పార్టీ పెట్టే ఆలోచన లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేశారని, ఆ పార్టీతో తన బంధం తెగిపోయిందని కవిత తేల్చిచెప్పారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరరావును పార్టీ వదులుకోవడమే బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణమని విశ్లేషించారు. తుమ్మల లాంటి నేతను దూరం చేసుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పని అన్నారు.

బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు తనకు, జాగృతి కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కనీస గుర్తింపు కూడా లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికార, ప్రతిపక్షాలు రెండూ తమ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమయ్యాయని కవిత విమర్శించారు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో తామే బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను పోషిస్తామని ప్రకటించారు. సామాజిక తెలంగాణ సాధనే తన ఆశయమని, అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కవిత విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేస్తున్నారని, బీసీల ద్రోహిగా మిగిలిపోతారని ఆరోపించారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని ఎద్దేవా చేశారు. సీతారామ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని, పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల సమస్యలపై బుధవారం హైదరాబాద్‌లో సింగరేణి భవన్‌ను ముట్టడిస్తామని కవిత ప్రకటించారు.



21న జాతీయ రహదారుల

## దిగ్బంధం..

భారీగా తరలిరావాలని

అన్నదాతలకు కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఈ నెల 21న నిర్వహించనున్న జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం లేదని తెలిపారు. రైతులతో మాట్లా డిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేదు అని అంటే ఎందుకు ఈ రోజు అదిలాబాద్ మార్కెట్ యార్డ్‌ని బంద్ పెట్టారు. మార్కెట్ యార్డులో రైతన్నలను కలుస్తామంటే ప్రభుత్వం ఎందుకు అడ్డంకులు కల్పించింది. చరిత్రలో ఎప్పుడు లేనంత దారుణంగా పత్తి కొనుగోలు సోయా రైతుల పరిస్థితి మారింది. కిసాన్ కపాస్ మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటి? ఆదిలాబాద్ జిల్లాలో మొబైల్ నెట్‌వర్క్ కనెక్టివిటీ అన్నిచోట్ల ఉండదు. మరి ఇలాంటి సందర్భంలో రైతన్నల పరిస్థితి ఏమిటో చెప్పాలి అని కేటీఆర్ అడిగారు. రాష్ట్రంలో భారీగా అకాల వర్షాలు పడినందు వలన పత్తితేమశాతం ఎక్కువగాఉన్నది. చలి కూడా గతంలో కంటే ఎక్కువగా ఉన్నది అందుకే పత్తిలో తేమశాతం ఉన్నది.

## హైదరాబాద్‌లో ఐటీ రైడ్స్..

పిస్తా హౌస్, షాగౌస్ హోటళ్ల చైర్మన్లు, డైరెక్టర్ల ఇండ్లలో సోదాలు




**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లో మరోసారి ఆదాయపు పన్ను శాఖ దాడులునిర్వహిస్తున్నది. నగరంలోని ప్రముఖ హోటళ్లయిన పిస్తా హౌస్, షాగౌస్ హోటళ్ల చైర్మన్లు, డైరెక్టర్లల నివాసాల్లో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. పలు పత్రాలు పరిశీలిస్తున్నారు. ఏకకాలం లో 15 చోట్ల మొత్తం 50కిపైగా బృందాలతో సోదాలు కొనసాగుతు న్నాయి. హైదరాబాద్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న అన్ని బ్రాంచీలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. కాగా, పిస్తా హౌస్, షాగౌస్ హోటళ్లు ఏటా వందల కోట్ల వ్యాపారం నిర్వహిస్తున్నాయి. దేశంలోని వివిధ నగరాలతోపాటు దుబాయ్‌లోనూ రెండు హోటళ్ల బ్రాంచీలు ఉన్నాయి. నిర్వహిస్తున్న వ్యాపారానికి, ఏటా సమర్పిస్తున్న ఐటీ రిటర్న్స్ లో తేడాలు ఉండటంతో దాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారం.

# గౌతమ్ మోడల్ స్కూల్ అనుమతులు రద్దు చేయాలి



## - స్కూల్ ను సందర్శించిన మానవ హక్కుల కమిషన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇలాక్యా కరుణాకరన్ (ఐపీఎస్)





**కాప్రా, నవంబర్ 18, (తెలంగాణ దిశ) :** కాప్రా సర్కిల్ నేతాజీ నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన గౌతమ్ మోడల్ స్కూల్ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ కాలనీ వాసులు మంగళవారం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. నూతనంగా స్కూల్ ఏర్పాటు చేయడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాలనీవాసులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న మానవ హక్కుల కమిషన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఇలాక్యా కరుణాకరన్ (ఐపీఎస్) మేడ్చల్ జిల్లా విద్యాశాఖాధికారి ఐ. విజయ కుమారి, ట్రాఫిక్ ఏసిపి ఎంవీ శ్రీనివాసరావు, కుషాయిగూడ ఎసిపి వెంకట్ రెడ్డి , ట్రాఫిక్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ ఎన్ఆర్ఎల్ రాజు, కుషాయిగూడ సిఐ ఎల్ భాస్కర్ రెడ్డి, కాప్రా తహసిల్దార్ బైరెడ్డి రాజేష్, కాప్రా టౌన్ ప్లానింగ్ సూపర్ వైజర్ తుల్జాసింగ్, కాప్రా మండల విద్యాధికారి దూసరి నరసింహ గౌడ్, కుషాయిగూడ సబ్ ఇన్ స్పెక్టర్ నిమ్మల వెంకన్న తదితరులు మంగళవారం పాఠశాలను సందర్శించారు. కాలనీ వాసులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే గౌతమ్ మోడల్ స్కూల్ అనే కొత్త పాఠశాలను ఇరుకైన కాలనీలో ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. బార్ కు అతి సమీపంలో పాఠశాల ఏర్పాటు చేశారని, పాఠశాలను ఏర్పాటు చేయడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. కాలనీ రహదారులు చాలా ఇరుకుగా, రద్దీగా ఉండటంతో పీక్ అవర్స్‌లో వాహనాలు నడపడం కష్టమవుతుందన్నారు. స్కూల్ యజమాన్యం రోడ్లకు అడ్డంగా భారీకేట్లు పెట్టి ట్రాఫిక్ కు ఇబ్బం ది కలిగిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ పరిస్థితుల్లో కొత్త పాఠశాల ఏర్పాటు చేయడం వల్ల కాలనీలో మరింత సమస్యలకు దారితీసే అవకాశం ఉందన్నారు. భవిష్యత్ సమస్యలను ముందు గానే అంచనా వేసి ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కు, జిల్లా విద్యాశాఖ అధికారికి అనుమతులను రద్దు చేయాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. స్కూల్ అనుమతులు తక్షణమే రద్దు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు స్పష్టం చేశారు.

# టీజీ టెట్-2026 పోస్టర్ ఆవిష్కరణ

## - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు






**శేరిలింగంపల్లి, నవంబర్ 18 (తెలంగాణ దిశ) :**రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టి-సాట్ టీజీ టెట్-2026 డిజిటల్ కోచింగ్ పోస్టర్ ను సచివాలయంలో ఆవిష్కరించారు. డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సచివాలయంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు నాణ్యమైన కంటెంట్ అందిస్తున్న టి- సాట్ ను మంత్రి అభినందించారు. ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్ష డీఎస్సీకి టెట్ అర్హత తప్పనిసరి కావడంతో అభ్యర్థులందరూ టి-సాట్ డిజిటల్ కంటెంట్ ద్వార సంసిద్ధులు కావాలని సూచించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రతీ ఏటా రెండు సీజన్లలో నిర్వహిస్తుండగా నిత్యం అందుబాటులో ఉండే టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో అభ్యర్థులకు ఉపయోగపడుతుందని మంత్రి గుర్తుచేశారు. గత రెండు సంవత్సరాల కాలంలో మూడు టెట్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, 2026 జనవరి నెలలో నిర్వహించే టెట్-2026 పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి విద్యాశాఖకు మెరుగైన వసతుల్ని కల్పిస్తున్నారని, 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు రికార్డు కాలంలో పూర్తి చేసారన్నారు. కేంద్ర గైడ్ లైన్స్ ప్రకారం టెట్ అర్హత ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడికీ తప్పనిసరి అయిన నేపథ్యంలో టెట్ కు హాజరయ్యే అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయుల కోసం సైతం ప్రత్యేక కంటెంట్ అందిస్తున్నామని సీఈవో బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పరీక్షల తేదీలను అనుసరించి టెట్ పరీక్షలకు నవంబర్ 18,19వ తేదీలు మంగళ, బుధవారాల్లో లైవ్ ఓరియంటేషన్ తో పాటు మరో 44 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు సీఈవో తెలిపారు. టి-సాట్ నిపుణ ఛానల్ లో సాయంత్రం 5గంటల నుండి ఏడు గంటల వరకు, విద్య ఛానల్లో ఉదయం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రతి రోజు నాలుగు గంటల పాటు ప్రత్యేక ప్రసారాలుంటాయని సీఈవో ప్రకటించారు. టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ కు అవసరమైన సబ్జెక్టులు చైల్డ్ డెవలప్మెంట్, సైకాలజీ, ఫిజికల్, బయాలాజికల్ సైన్స్, మాథ్స్, సోషల్ స్టడీస్‌తో పాటు ఇంగ్లీష్, తెలుగు ఇతర సబ్జెక్టులకు సంబంధించిన డిజిటల్ లెసన్స్ ప్రసారమౌతాయన్నారు. టెట్ పేపర్-1, 2 పరీక్షలకుహాజరయ్యే అభ్యర్థులు టి-సాట్ అందించే ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి కోరారు. టెట్ అర్హత పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ ప్రసారం చేసే ప్రత్యేక కంటెంట్ టి-సాట్ శాటిలైట్ ఛానళ్లతో పాటు, టి-సాట్ యాప్, యూట్యూబ్ లో అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్ పాల్గొన్నారు.

# బసవ పున్నయ్యపై ఎస్ సి, ఎస్ టి కేసు నమోదు చేయాలి

## - నవతెలంగాణ పత్రిక నుండి తొలగించాలి

## - తెలంగాణ ఎస్ సి, ఎస్ టి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల రాజశేఖర్



**హైదరాబాద్, నవంబర్ 18 (తెలంగాణ దిశ) :**దళిత జర్నలిస్టు బండి విజయ్ కుమార్ ను అవమానపరుస్తూ సంఘం నుండి బహిష్కరించామని పత్రికా ప్రకటన చేసిన బసవ పున్నయ్య పై ఎస్ సి, ఎస్ టి కేసు నమోదు చేయాలని, నవ తెలంగాణ పత్రిక నుండి వెంటనే తొలగించాలని తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల రాజశేఖర్ డిమా ండ్ చేశారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బసవ పున్నయ్య ఒక దళిత ద్రోహి అన్నారు. నవ తెలంగాణ సంస్థలో పని చేస్తున్న అనేకమంది దళిత జర్నలిస్టులను కుట్రలతో అణచివేశాడని ఆరోపించారు. ప్రజల పక్షాన పని చేసే పత్రికలో పని చేస్తూ పేద దళిత వర్గాలను కించపరుస్తూ అవమానపరిచే విధంగా ప్రకటనలు జారీ చేయడం పట్ల ఆయన మండి పడ్డారు. దళితుల పక్షాన నిలవాల్సిన ఆ పత్రికలో దళితులను బహిష్కరిస్తున్నట్లు వార్తలు పెట్టడం దుర్మార్గం అన్నారు. ఇలాంటి వార్తలను ప్రచురిస్తున్న ఆ పత్రిక విలువలు కోల్పోయిందనడానికి నిదర్శనం అన్నారు. వెంటనే ఆ పత్రిక యజమాన్యం ఆయనను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆ పత్రిక కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# స్టేడియం స్థలం చుట్టూ హద్దులు గుర్తింపు

## - స్టేడియం స్థలానికి ప్రహరీ నిర్మాణానికి చర్యలు







**ఏఎస్ రావునగర్, నవంబర్ 18, తెలంగాణ దిశ) :**కాప్రా సర్కిల్ ఏఎస్ రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డలోని సర్వే నెంబర్ 199 లోని ప్రభుత్వ భూమి స్టేడియం ల్యాండ్ హద్దులను సోమవారం అధికారులు నిర్ణయించారు. అనేక వివాదాల అనంతరం స్థల పరిరక్షణ కోసం ఎట్టకేలకు అధికారులు నడుం బిగించారు. ఇందులో భాగంగా సోమవారం కాప్రా తహసిల్దార్, జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ అధికారులు జమ్మిగడ్డ లోని స్టేడియం స్థలాన్ని సందర్శించారు. హద్దులు నిర్ణయించారు. స్థలాన్ని పరిరక్షించేందుకు చుట్టూ ప్రహరీ నిర్మించాలని నిర్ణయించారు. స్టేడియం ల్యాండ్ కోసం జమ్మిగడ్డ స్మశానవాటిక పరిరక్షణ కమిటీ కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా పోరాటం చేస్తున్న విషయం విధితమే. ప్రభుత్వ స్థలాలను కాపాడటమే లక్ష్యంగా ఏర్పడిన హైడ్రా సహకారంతో స్టేడియం ల్యాండ్ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మొత్తం 9 ఎకరాల 22 గుంటల భూమికి రక్షణగా ప్రహరీగోడ నిర్మించేందుకు మంగళవారం అధికారులు హద్దులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణమోహన్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నాగేందర్, డీఈ బాలకృష్ణతో పాటు రెవెన్యూ అధికారులు సంయుక్త పరిశీలనలో భాగంగా హద్దులు నిర్ధారించారించడం హర్షనీయమన్నారు. ఇక రెండమూడు రోజుల్లో ప్రహరీగోడ నిర్మాణ పనులు కూడా ప్రారంభం కానున్నట్లు ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో స్టేడియం కోసం దాదాపు 12 ఎకరాల భూమిని కేటాయిస్తే కాలక్రమేణ 9.22 ఎకరాలకు చేరిందని, అందులో అంతర్భాగమైన స్మశానవాటిక స్థలంతో పాటు మిగిలిన భూమిని కాపాడుకునేందుకు గత కొన్నేళ్లుగా తాను పోరాటం చేస్తున్నానని చెప్పారు. తన పోరాటానికి ఎట్టకేలకు అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి రక్షణ చర్యలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. స్మశానవాటిక భూమి చుట్టూ కూడా కంపౌండ్ వాల్ నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు.

# ఘనంగా శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు





ఏఎస్ రావునగర్, నవంబర్ 18, (తెలంగాణ దిశ) :ఏఎస్ రావునగర్ డివిజన్‌లోని జమ్మిగడ్డ బీజెఆర్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులతో దేవాలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రత్యేక అలంకరణలు, ధ్వజారోహణం, హనుమాన్ చాలీసా పారాయణం, వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది .కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాకాల రాజు ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, స్టేట్ ఓబీసీ కన్వీనర్ మేదరి రామలింగం, నాయకులు అనిల్ కుమార్, భద్రగామ నర్సింహా, జమ్మిగడ్డ శ్రీనివాస్, కె. ప్రకాష్, ప్రసాద్ తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక భక్తులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో దేవాలయ ప్రాంతం సందడిగా మారింది. తొలుత భక్తులకు తీర్థ ప్రసాదాలు అంద జేశారు. ఈ సందర్భంగా కేశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ వీరాంజనేయ స్వామి ఆశీర్వాదంతో ప్రజలందరికీ శాంతి, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు.

# కన్నుల పండువగా శ్రీ శివాంజనేయ స్వామి వార్షికోత్సవ వేడుకలు





**ఏఎస్ రావునగర్, నవంబర్ 11, (తెలంగాణ దిశ) :**ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోనిజమ్మిగడ్డ పీజేఆర్ కాలనీలో శ్రీ శివ ఆంజనేయ స్వామి వారి పదకొండవ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏఎస్ రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. గత 11 సంవత్సరాలుగా ఆలయ నిర్వహకులు భక్తిశ్రద్ధలతో వార్షికోత్సవ కార్యక్రమాలతో పాటు నిత్య పూజలు చేయడం అభినందనీయమన్నారు. డివిజన్ ప్రజలు సంపూర్ణ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యాకయ్య, శ్రీనివాస్ గౌడ్, ప్రకాష్ రాజన్న, టైలర్ శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## దర్యాప్తు సంస్థలను బలోపేతం చేయాలి

కేంద్ర దర్యాప్తు సంస్థలు సిబిఐ, ఇడిలను బలోపేతం చేయడంతో పాటు నిజాయితీగా పనిచేసే సంస్థలుగా తీర్చిదిద్దాల్సి ఉంది. మెరికలైన అధికారులను వీటికి కేటాయించాలి. ఎలాంటి కేసునైనా ఛేదించి ఫలితం చూపేలా తయారు చేయాలి. దేశంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించాల్సి అవసరం ఉంది. కానీ ఇప్పుడు రాజకీయ పార్టీలకు ఇడి, సిబిఐలు అంటే భయం లేకుండా పోయాయి. వీటి సమర్థతపై ఉన్న అనుమానాలే దీనికి కారణమని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాల్సి ఉంది. కేవలం రాజకీయ కక్ష తీర్చుకునేందుకు వీటిని ఉపయోగిస్తున్నారన్న ఆరోపణల నుంచి బయటపడాలి. ఇప్పటివరకు ఏ ఒక్క కేసులోనూ నిగ్గు తేల్చిన దాఖలాలు లేవు. మద్యం కేసు కావచ్చు..ఇతర అవినీతి కేసులు కావచ్చు..ఏవీ ముందకు సాగడం లేదు. అంతెందుకు వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును ఆరేళ్లయినా నిగ్గు తేల్చలేదు. అందుకే దర్యాప్తు సంస్థల ప్రతిష్టను పెంచేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలి. ఇకపోతే ఢిల్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ విమర్శలకు పదను పెడుతున్నారు. బిజెపికి కేజ్రీవాల్ సవాళ్లు విసురుతున్నారు. ఇదే క్రమంలో ఢిల్లీ సిఎం అతిషిపైనా కేసులు తప్పకపోవచ్చన్న ప్రకటన చేశారు. బిజెపి కేసులతో లొంగదీసుకోవాలని చూస్తోందని మండిపడ్డారు. నిజానికి బిజెపి ముందు ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలు తప్ప మరో ఎన్నిక లేదని చెప్పాలి. ఢిల్లీలో మరోమారు అధికారం కోసం కేజ్రీవాల్ చెమటోడుస్తున్నారు. అయితే గతంతో పోలిస్తే అంత సులభంగా విజయం దక్కక పోవచ్చు. ఆప్‌కు చెందిన అనేకులు పార్టీని వీడి బిజెపిలో చేరారు. అయితే రాజకీయ ప్రత్యర్థులను వేధించడమే లక్ష్యంగా మోడీ సర్కారు కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడానికి బరితెగిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలంగా ఉన్నవారిని ఒక రకంగా లేనివారిని మరో రకంగా చూస్తున్నారు. జగన్, కెసిఆర్ విషయంలో మాత్రం బిజెపి ఎందుకనో వెనకడుగు వేసింది. ఈ ఇద్దరిపైనా అవినీతి ఆరోపణలు చేసినా, పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పటికీ బిఆర్‌ఎస్‌తో లోపాయకారి అవగాహన ఉందన్న ప్రచారం ఉంది. ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎండగట్టడంతో పాటు, తెలంగాణలో ఓ ప్రాంతీయ పార్టీ అవసరం ఉందని బిజెపి గుర్తించివుంటుంది. అందుకే బిఆర్‌ఎస్ అవినీతిపై మాట్లాడినా పెద్దగా పట్టించుకోవడం లేదు. కవిత విసయంలో కూడా కేసు పెద్దగా బలంగా లేదన్న వాదనలు ఉన్నాయి. ఈ కేసులో కేజ్రీవాల్, కవితలు ఇద్దరూ బెయిల్‌పై బయలకు వచ్చారు. అందుకే గత కెస్ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై బిజెపి నేతలు స్పందించడం లేదు. జగన్ లోపాయకారిగా బిజెపికి అనుకూలంగా ఉన్నాడని విమర్శలు ఉన్నాయి. తెలంగాణలో కూడా కెసిఆర్ అనుకూలంగా ఉ న్నందువల్లే ఆయనపైనా ఈగ వాలనీయడంలేదని అంటున్నారు. ఈ విషయమై ఎన్ని విమర్శలు చేసినా కేంద్ర ప్రభుత్వ వైఖరిలో నామమాత్రపు మార్పు కూడా కనిపించడంలేదు. గతంలో విపక్షాలపై అదేపనిగా కేసులు పెట్టడంతో ప్రతిపక్షాలన్నీ కలిసి మూకుమ్మడిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చింది. ఇడి, సిబిఐ వంటి సంస్థలను తమ జేబు సంస్థలుగానే మోడీ ప్రభుత్వం భావిస్తోందని ఇండియా కూటమి బాహాటంగానే విమర్శిస్తోంది. ప్రతిపక్షనేతలను నయానో, భయానో లొంగదీసుకోవడానికి, అలా లొంగని వారిని కేసులతో వేధించడానికి ఆ సంస్థలను దుర్వినియోగ పరుస్తున్న తీరుపై రాజకీయ పార్టీలో ఆందోళన చెందుతున్నాయి. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను కేసుల్లో ఇరికించినా ఆయన మళ్లీ అధికారం చేపట్టగలిగారు. బిజెపి నిరంకుశ పోకడలకు వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నందునే ఇడిని ఉపయోగించి కేసులు పెడుతున్నారని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఎప్పటినుంచో ఆరోపిస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలోనూ ఇదే స్థితి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆప్ అధ్యక్షుడు కేజ్రివాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు ఇడి బాధితులుగా మారడానికి కారకులెవరో అందరికీ తెలిసిందే. ఇలా చెప్పుకుంటూ పోతే బిజెపి దుర్నీతికి, దుర్వినియోగానికి ఉదాహరణాలెన్నో! 2014వ సంవత్సరంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి గత ఏడాది జనవరి వరకు దేశ వ్యాప్తంగా 121 మంది రాజకీయ నేతలపై ఇడి కేసులు పెట్టి విచారణ చేపట్టింది. వీరిలో 115 మంది అంటే 95 శాతం మంది ప్రత్యర్థి రాజకీయ పార్టీలకు చెంది, బిజెపిని గట్టిగా వ్యతిరేకించే వారే కావడం గమనార్హం. ఇలా కేసులు నమోదైన వారు బిజెపిలో చేరితే వెంటనే వారిపై నమోదైన కేసులను ఎత్తివేయడం, వారిలో కొందరికి ప్రభుత్వ పదవులను సైతం కట్టబెట్టడం మోడీ సర్కారు బరితెగింపునకు మరో నిదర్శనం. మరోవైపు ఇడి కేసుల్లో నేరం రుజువై శిక్షపడినవి చాలా తక్కువ. అధికారిక లెక్కల ప్రకారం 2011 నుండి ఇడి 1600 కేసులు నమోదు చేసి, 1800 దాడులను ఇడి నిర్వహించింది. అయినా, భయపడుతున్నారంటే ఇతర దర్యాప్తు సంస్థలకు లేని ప్రత్యేక అధికారాలు ఇడి కి ఉ ండటమే కారణం. ముఖ్యంగా న్యాయస్థానాల అనుమతి లేకుండానే ఆస్తులు జప్తు చేసే అధికారం ఒక సారి కేసు నమోదైతే నేరం చేయలేదని రుజువు చేసుకునే బాధ్యత నిందితునిపైనే మోపడం వంటి అధికారాలను ఇ.డి కి అప్ప గించారు. ప్రస్తుత పార్లమెంటులోని ప్రతిపక్ష సభ్యుల్లో దాదాపు 90 శాతం మంది ఏదో ఒక కేంద్ర దర్యాప్తు సంస్థ నిఘానీడలో ఉన్నట్లు ఇటీవల విడుదలైన ఒక నివేదిక పేర్కొంది. తీవ్ర స్థాయిలో జరుగుతున్న ఈ అధికార దుర్వినియోగాన్ని అరికట్టి, దర్యాప్తు సంస్థల నిష్పాక్షికతపై ప్రజానీకంలో తిరిగి నమ్మకం కలిగించాల్సి ఉ ంది. దర్యాప్తు సంస్థలకు స్వయం ప్రతిపత్తి మాత్రమే దీనికి పరిష్కారం. ఇలా చేయడం వల్ల నిజంగానే తప్పులు చేసిన వారి భరతం పట్టవచ్చు.

# కాప్రా తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం

### - ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తే సహించేదిలేదు : పత్తి కుమార్






**కాప్రా, నవంబర్ 18, (తెలంగాణ దిశ) :**కాప్రా మండల తహసీల్దార్ కార్యాలయంలో ధ్రువపత్రాల జారీలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్ సీ సెల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కుమార్ ఆరోపించారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురొ ్కంటున్నా రన్నారు. కుల, ఆదాయ, నివాస తదితర ధృవీకరణ పత్రాలతో పాటు ఇతర పనులపై వచ్చే ప్రజలు అధికారుల తీరుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా అత్యవసర ధ్రువపత్రాల కోసం ప్రజలు ప్రతి రోజూ కార్యాలయానికి వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం చెలరేగుతోందన్నారు. ధ్రువపత్రాల కోసం వచ్చిన వారినిఇంకా సమయం ఉంది రేపు రండి అంటూ తిరిగి పంపేస్తుండడంతో నెలల తరబడి ప్రజలు కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. కార్యాలయానికి అధికారులు సమయానికి రాకపోవడంపై కూడా ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు, ప్రజలను అవమానించే రీతిలో ప్రవర్తిస్తున్నారన్నారు. పని తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

డిప్యుటేషన్‌పై ఉన్న డిప్యూటీ తహసీల్దార్ ధ్రువపత్రాల జారీ విషయంలో ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ ఇన్ స్పెక్టర్ కూడా సాధారణ ప్రజల సమస్యలు వినకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజల ప్రధాన సమస్యల పరిష్కారంతోపాటు ధ్రువపత్రాల జారీకి అనవసర ఆలస్యం, కార్యాలయానికి అధికారులు సమయానికి రాకపోవడం జరుగుతుందన్నారు. సమస్యలు చెప్పుకున్నా పట్టించుకోని ధోరణి, తర్వాత రండి అంటూ తిరస్కరించడం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అధికారుల సహకారం లేకపోవడంతో పాటు భూ సంబంధిత పనుల్లో అవినీతి ఆరోపణలు, ప్రస్తుత అధికారుల పనితీరుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి స్థానంలో బాధ్యత గల అధికారులను నియమించాలని పత్తి కుమార్ డిమాండ్ చేశారు. త్వరలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు.

# అధికారులతో కలసి పాదయాత్ర చేసిన కార్పొరేటర్ హమీద్ పటేల్






**కొండాపూర్, నవంబర్ 18, (తెలంగాణ దిశ)** : కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ ఏ బ్లాకులోని డంపింగ్ ప్రాంతంలో స్థానిక నాయకులు, అధికారులతో కలసి కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ పాదయాత్ర చేశారు. ఈ సందర్బంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలు గుర్చి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వీధులలో పెండింగ్ లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి కావాల్సిన చర్యలు తీసుకోని త్వరితగతిన పనులు పూర్తి చెయ్యాలని సంబంధిత జలమండలి అధికారి సందీప్ ని ఆదేశించారు. కొన్ని చోట్ల మంచినీటి సప్లై తక్కువగా రావటం వంటి పిర్యాదులు గుర్తించి, వాటర్ సప్లై లైన్లను క్లియర్ చేయించి, వీలైనంత వరకు నీటి కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వాటర్ సప్లై చేసే క్రింది స్థాయిలో పని చేస్తున్న కొందమంది సిబ్బంది పై వస్తున్న పిర్యాదులు పట్ల జాగ్రత్తతో ఉంటూ, వారికీ సరైన అవగాహన, శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు.

అలాగే డంపింగ్ ప్రాంతంలో అవసరం ఉన్న వీధి దీపాల స్థంబాల పనులను వెంటనే పూర్తి చెయ్యాలని, ఒక స్థంబానికి మరొక స్థంబానికి కనీస దూరం పాటిస్తూ, ఎక్కడ కూడా కేబుల్స్ క్రిందకి వేలాడకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఎలక్ట్రికల్ శాఖ అధికారిని నికిత ను ఆదేశించారు. వీధి దీపాలు వెలగటం లేదని పిర్యాదులు ఎక్కువ రావటం పట్ల దృష్టి సారించి, సిబ్బందిని సమన్వయం చేసుకొని వీధి దీపాల సమస్యలు త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలుండాలన్నారు. బస్తీ పాదయాత్రలో కార్పొరేటర్ హమీద్ పటేల్ తో పాటు వాటర్ మేనేజర్ సందీప్, ఇంచార్జ్ శ్రీకాంత్, మున్సిపల్ ఎలక్ట్రికల్ శాఖ ఎఈ నిఖిత, అసిస్టెంట్ చిరంజీవి, ఇంజనీరింగ్ శాఖ వర్క్ ఇన్ స్పెక్టర్ రవి, స్థానిక నాయకులు ఇమామ్, సలీం, ఖదీర్, ఇంతియాజ్, షాదిక్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# యదేచ్చగా అక్రమ షెడ్ నిర్మాణాలు

### - బండ్లగూడ ప్రధాన రహదారిలో అక్రమ షెడ్ నిర్మాణం..
### - చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్న కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారిణి



**నాగారం, నవంబర్ 18, (తెలంగాణ దిశ) :** నాగారం మున్సిపాలిటీ పరిధిరాంపల్లి సిగ్నల్ నుంచి కీసరకు వెళ్లే అహ్మద్ గూడ మెయిన్ రోడ్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏకంగా రాత్రికి రాత్రి గుట్టు చప్పుడు కాకుండా అక్రమ షెడ్ నిర్మాణం జరుగుతుంది. అక్రమార్కులు కనుసన్నల్లో దర్జాగా అక్రమ షెడ్ల నిర్మాణాలు జరుగుతుంటే టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంలో అంతర్యమేమిటో అర్థం కావడం లేదు. నాగారం మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతుందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఖజానాకు గండిపడుతుంటే నాగారం కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారనేది

అంతు చిక్కని ప్రశ్నలు..? ఇలాంటి అవినీతి అక్రమాలకు పరిష్కారం లేదా..? అని స్థానికులు చర్చించుకుం టున్నారు. నాగారం మున్సిపల్ లో అక్రమాలకు అడ్డాగా మారిందనడంలో సందేహం లేదు..? అక్రమ నిర్మాణాలపై గతంలో అనేక సార్లు వార్తా పెదనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారు. ఈ అక్రమ నిర్మాణం పై సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఆలోపతితో పాటు.. ఇతర వైద్య సేవలు. .



అనంతపురం, : ఏపీలో ఆయుష్ వైద్య సేవలను మెరుగుపరచడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని ఆరోగ్యశాఖా మంత్రి సత్య కుమార్ అన్నారు. ఆయుర్వేద, హోమియో, యూనాని, ప్రకృతి వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో భాగంగా ఆసుపత్రులను కొత్తగా ఏర్పాటుచేసేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే రాష్ట్రంలోనే తొలి నేచర్ క్యూర్ వైద్య కళాశాల వైజాగ్ లో రాబోతుంది. ఇందులో 2026 27 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలు ప్రారంభం కాబోతున్నా యి. విశాఖ, కాకినాడలో ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రులు సిద్ధమవు తున్నాయి. అలాగే...విశాఖ నగరంలోనే ప్రభుత్వ ఆయుర్వేద మందుల తయారీ, నాణ్యత పరీక్షల ప్రయోగ శాల కూడా రాబోతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం.. 2016?17 లో నేచర్ క్యూర్ ఆసుపత్రి (ప్రకృతి వైద్య కళాశాల), రెండు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన అనంతరం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ చూపుతున్న చొరవతో కాకినాడ ఆసుపత్రికి రూ. 7.17 కోట్లు, విశాఖలో ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రికి రూ. 4.18 కోట్లు, నేచర్ క్యూర్ వైద్య కళాశాలకు రూ. 4.08 కోట్లు మంజూరయ్యాయని వైద్య శాఖ ప్రకటన రిలీజ్ చేసింది. కేంద్రం నుంచి మూడు సంవత్సరాల తరువాత నిధుల విడుదల అవుతున్నాయనీ దీనివల్ల ఆయుష్ వైద్య సేవలు మెరుగుపడుతున్నా యని మంత్రి సత్యకుమార్ అన్నారువిశాఖలోని విమ్స్ ప్రాంగణంలో రూ. 16.40 కోట్లతో చేపట్టిన నేచర్ క్యూర్ వైద్య కళాశాలలో 2026?27 విద్యా సంవత్సరం నుంచి బ్యాచులర్ ఆఫ్ నాచురోపతి అండ్ యోగా సైన్సెస్ (బీఎన్వైఎస్) కోర్సులో తరగతులు ప్రారంభం కానున్నాయి. బీఎన్ వైఎస్ కోర్సులో 50 సీట్ల భర్తీకి కేంద్రం ఆమోదం తెలుపనుంది. ఈ కళాశాల పక్కనే.. రూ. 14.85 కోట్ల వ్యయంతో 50 పడకలతో చేపట్టిన ఆయుష్ ఇంటిగ్రేటెడ్ ఆసుపత్రి నిర్మాణపనులు కూడా పూర్తయ్యేదశలో ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో ఆయుర్వేద, హోమియో, యూనాని వైద్య సేవలు ప్రజలకు త్వరలోనే అందుబాటులోనికి వస్తాయి. వీటి ఆధారంగా కేంద్రం అడ్మిషన్స్ కు అనుమతి ఇస్తునీది. గవర్నమెంట్ ఇన్స్టిట్యూట్ అయినందున అడ్మిషన్స్ త్వరగా స్టార్ట్ చేయడానికి వెసులుబాటు ఉంది.నేచర్ క్యూర్ వైద్య కళాశాల ఏర్పాటుకు తగ్గట్లు ప్రత్యేకంగా నేచర్ క్యూర్ ఆసుపత్రి ఏర్పాటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 50 పడకలతో ఈ ఆసుపత్రి ఏర్పాటుపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. సుమారు రూ. 16 కోట్లు కేంద్రం నుంచి రానున్నాయి.విశాఖలోని శొంఠ్యాం ప్రాంతంలో సుమారు రూ. 6 కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ,డ్రగ్ టెస్టింగ్ లేబరోరేటరీల భవన నిర్మాణాలు పూర్తికావొచ్చాయి.

# మళ్లీ తెరపైకి ఇచ్చంపల్లి..!

**కరీంనగర్,తెలంగాణ దిశ :**కాళేశ్వరం వల్ల తెలంగాణకు లాభం లేదని.. దానివల్ల విపరీతమైన ఖర్చు అవుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో భాగంగానే ఖర్చు లేకుండానే.. తెలంగాణలో మెజారిటీ పంట పొలాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలోనే నిజాం కాలం నాటి ప్రాజెక్టును తెరపైకి తీసుకువచ్చిం ది. ఇంతకీ ఆ ప్రాజెక్టు ఏమిటి? నిజాం కాలంలోనే ఫ్రెంచ్ దేశాలు చెందిన ఇంజనీర్లు ఇచ్చంపల్లి ప్రాజెక్టును మొదలుపెట్టారు.. ఆ తర్వాత ఈ ఆగిపోయింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా నదుల అనుసంధానం గురించి చర్చ జరుగుతున్న నేపథ్యంలో.. నిజాం కాలంలో ఇచ్చంపల్లి ప్రాంతం వద్ద నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టును పూర్తి చేయాలని రేవంత్ ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు ఈ ప్రాజెక్టు పూర్తి చేసి గోదావరి జలాలను బీడు భూములకు మళ్ళించాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.ఫ్రెంచ్ దేశానికి చెందిన 30 మంది ఇంజనీర్లు.. వేలాది మంది కూలీలు ఇచ్చంపల్లి ప్రాజెక్టు పనుల్లో అప్పట్లో తలమున కలయ్యారు. ఒకవేళ ఆ ప్రాజెక్టు గనుక అప్పట్లో పూర్తయి ఉంటే హైదరాబాద్ నగరానికి నిత్యం తాగునీరు అందేది. అంతేకాదు లక్షల ఎకరాలకు సాగునీరు కూడా అందేది. అయితే అనుకోకుండా ఏర్పడిన అవాంతరాల వల్ల ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. అంతు చిక్కని వ్యాధి సోకి ఇంజనీర్లు, కూలీలు చనిపోయారు. ఇక ఆ తర్వాత ఆ ప్రాజెక్టు పనులు మొదలు కాలేదు. అయితే ఇప్పటికి నాటి కట్టడాలు కనిపిస్తూనే ఉన్నాయి.. ముఖ్యంగా చత్తీస్ గడ్ వైపు నిర్మించిన బండ్ అత్యంత బలంగా కనిపిస్తోంది.నదులను అనుసంధానం చేయాలని ఇటీవల కేంద్రం ప్రయత్నాలు చేస్తోంది. మరోవైపు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా ఇక్కడి జీవ నదులను అనుసంధానం చేయాలని భావిస్తున్నారు.. ఇందులో భాగంగానే ఇటీవల ఇంజనీర్లు సమగ్రంగా పరిశీలన చేపట్టారు. ఇచ్చంపల్లి ప్రాజెక్టుతో పాటు ములుగు జిల్లా మంగపేట మండలం రాంపురం, కన్నాయిగూడెం మండలం కంతనపల్లి వద్ద గోదావరి పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. అయితే నాడు ఫ్రెంచ్ ఇంజనీర్లు డిజైన్ చేసిన ఎత్తిపోతల పథకం నేటికీ అనుకూలంగానే ఉందనే భావన సాగునీటి రంగ వ్యక్తమవుతోంది. అయితే నాటి కట్టడాలను పునరుద్ధరించి.. ఇప్పటి కాలానికి అనుగుణంగా ఆధునికరించి గోదావరి జలాలను బీడు భూములకు మళ్ళించాలనేది రేవంత్ ప్రభుత్వం ప్రతిపాదనగా ఉన్నట్టు తెలుస్తోంది.మరోవైపు గోదావరి నది మీద నిర్మించిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి మహారాష్ట్ర నుంచి వచ్చే ప్రాణహిత నది నీళ్లు మాత్రమే ఆధారం. ప్రాణహిత ప్రవాహం వల్ల మేడిగడ్డ ప్రాంతంలో 2,843 ఎఓఅ ల మీరు అందుబాటులో ఉంటుంది. ప్రాణహిత తరహాలోనే ఎంత చెప్పండి ప్రాంతం ఎగువన 108 మీటర్ల దూరంలో ఇంద్రావతి నది గోదావరిలో కలుస్తుంది. పూర్తిగా అడవి ప్రాంతం నుంచి వస్తున్న ఇంద్రావతి నది ప్రవాహం వృధాగా సముద్రంలో కలుస్తోందని నిపుణులు చెబుతున్నారు. ప్రాణహితతో పాటు ఇంద్రావతి నది ప్రవాహాన్ని కూడా పూర్తిస్థాయిలో వాడుకుంటే తెలంగాణలో కరువు అనేది ఉండదని అధికారులు చెబుతున్నారు. ఇచ్చంపల్లి వద్ద ప్రాజెక్టు నిర్మించి.. ఆ నీటిని నాగార్జునసాగర్ వైపు తరలిస్తే మరింత ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.గోదావరి పరివాహక ప్రాంతంలో మాత్రం వర్షాలు మెండుగా ఉంటున్నాయి. అందువల్లే ఇచ్చంపల్లి ప్రాజెక్టు నిర్మించి.. తద్వారా ఆ నీటిని కృష్ణా నదికి మళ్లిస్తే నీటి కొరతను తగ్గించవచ్చనేది సాగునీటి రంగ నిపుణుల అభిప్రాయం.. ఇంద్రావతి నదికి 116 మీటర్ల దూరంలో ఉన్న భూపాలపల్లి జిల్లా పలిమెల ఆరంపల్లి వద్ద అప్పట్లో ఫ్రెంచ్ ఇంజనీర్లు గోదావరి నదిపై ఆనకట్టను నిర్మించారు.

# కోటి మంది మహిళలకు కోటి చీరలు...

## అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీర - రేపు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పంపిణీ ప్రారంభం

## - ఇందిరమ్మ చీరలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**హైదరాబాద్, నవంబర్ 18, (తెలంగాణ దిశ):** కోటి మంది మహిళలకు కోటి చీరలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంగళవారం మంత్రి సీతక్కతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించనున్నారు. చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా రెండు దశలుగా చీరల పంపిణీ చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందిరా గాంధీ జయంతి నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చీరల నాణ్యత విషయంలో రాజీపడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందిం చాలని ముఖ్యమంత్రి అధికారు లను ఆదేశించారు. సాంకే తికను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడా లని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళు లు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి వీడియోకాన్ఫరెన్స్ లో పాల్గొనాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ హ్యాండ్లూమ్స్ శైలజా రామయ్యర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, సెర్ప్ సీఈవో డి. దివ్య, తదితరులు పాల్గొన్నారు.

## నీతివంతుడైన శ్రీధర్ బాబు పై నిందలు వేస్తే ఖబర్దార్

**కమాన్ పూర్,తెలంగాణ దిశ:** మంథని ప్రజల ఆరాధ్య దైవమైన నీతిమంతుడైన మంత్రి శ్రీధర్ బాబు పై నిందలు వేస్తే పుట్టమధు ఖబర్దార్ అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ కమాన్ పూర్ సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు హెచ్చరించారు. ఈ మేరకు కమాన్ పూర్ మండల కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పుట్ట మధు అవగాహన రాహిత్యం గా మాట్లాడడం విడ్డూరంగా ఉందని దొంగ అంటే దొంగల ఉందని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబును ఆబాస్ పాలు చేస్తే ప్రజలు ఊరుకోరని ఆయన ఆరుసార్లు మంథని నుండి ఎమ్మెల్యేగా గెల్పొంది ప్రాతినిధ్యం వహించాడు అని మీకు ఒకే ఒకసారి అవకాశంఇస్తే దాన్ని బంగారు బాతు గుడ్డులా వాడుకున్నావని అన్నారు. ఈ వ్యవహారం చూస్తే చదువురాని సన్యాసులు ఎలా మాట్లాడుతారో అర్థం అవుతుందని అన్నారు. ఎల్లంపల్లి నుండి ఏడు క్యూసెక్కుల నీరును బయటికి పంపించడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే కమాన్ పూర్ స్థానిక నాయకులు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏదో లబ్ధి పొందాలని చూస్తున్నారని వారికి ప్రజలు మద్దతు పలికే ప్రసక్తే లేదని అన్నారు. కమాన్ పూర్ సింగల్ విండో ద్వారా 5945 బస్తాలు రైతులకు అందించడం జరిగిందని ఈనాడు కూడా కమాన్ పూర్ లో యూరి యా కొరత లేదని పేర్కొన్నారు. ఒకప్పుడు కిరాయి ఇండ్లలో ఉన్న నీకు రాజగృహ ఎక్కడ నుంచి వచ్చిందని ప్రశ్నించారు. అవినీతికి ప్రేమేయం ఇవ్వకుండా నీతి న్యాయంగా ప్రజలకు చేరువైన శ్రీధర్ బాబు పై ఎటువంటి ఆరోపణలు చేస్తే ప్రజలే తరిమి కొడతారని హెచ్చరించారు.మండల అధ్యక్షులు సయ్యద్ అన్వర్, సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, , మల్యాల తిరుపతి, మల్యాల మహేష్, నాగునూరి నర్సయ్య, చాట్ల రాజమల్లు, గెల్లు లింగయ్య, బంగారి రమేష్,చాట్ల గట్టయ్య, బంగారి మహేష్ తదితరులు పాల్గొన్నారు

## కీసరగుట్టలో పూజా సామాగ్రి దోపిడీ..

# భక్తుల్లో ఆవేదన




## "దీపం 350...? టెంకాయ 100..? పుణ్యక్షేత్రంలో ఇదేం పరిస్థితి?"..

### ఇంతకు దీని వెనుక ఎవరి హస్తం - చైర్మన్ లేక ఈఓనా..? - దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి

**కీసర, నవంబర్ 18, (తెలంగాణ దిశ):** కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి భక్తుల రద్దీ అమాంతం పెరిగింది. అయితే ఈ పవిత్ర పుణ్యక్షేత్రంలో పూజా సామాగ్రి ధరలు అదుపు తప్పడం భక్తులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. ఆలయం చుట్టుపక్కల ప్రాంతంలో విక్రేతలు అమాతం అధిక ధరలు వసూలు చేస్తున్నారని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ మార్గంలో ఉన్న పూజా సామాగ్రి విక్రయ దుకాణాల్లో ఒక కార్తీక దీపం రూ. 350, చిన్నదానికి రూ.200, ఒక్క టెంకాయ రూ. 100 వరకు ధర చెప్పడాన్ని చూసి భక్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. పార్కింగ్ ప్రాంతం నుంచి ఆలయం ప్రవేశ ద్వారం వరకు ఎక్కడ చూసినా ఇష్టానుసారం ధరలు, ఎలాంటి నియంత్రణ లేకుండా విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయని స్పష్టం అవుతోంది. ఈ పరిస్థితిపై భక్తులు వ్యాపారులను ప్రశ్నిస్తున్నారు.
దేవాలయం చుట్టూ ఇలాంటి దోపిడీని ఎవరు ఆపాలి ..?, చైర్మన్ ఎక్కడ .? ఈఓ ఎందుకు స్పందించడం లేదు?" పుణ్యక్షేత్రంలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని పర్యవేక్షించాల్సిన అధికారులు ఇలాంటి కీలక సమస్యపై స్పందించకపోవడం భక్తుల్లో మరింత ఆందోళన కలిగిస్తోంది. వీళ్లకు ధరల పెరుగుదలపై ఎవరి అనుమతి తీసుకున్నారో స్పష్టత లేదు, చైర్మన్ కు చెప్పి ధరలు పెంచారా? అంటూ ఆలయ నిర్వహణ వ్యవస్థపై కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్రమబద్ధమైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.
ఈ దోపిడీ ధరల కారణంగా పుణ్య క్షేత్ర పవిత్రత దెబ్బతింటోందని, భక్తుల భక్తి, విశ్వాసం మీద దుకాణదారులు వ్యాపారం చేయటం ఆపాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. దేవాలయ శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని పూజా సామాగ్రికి రేటు లిస్టులను అమలు చేయాలని, అధిక ధరలు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కీసరగుట్ట తెలంగాణలో అత్యంత పవిత్రమైన శివ క్షేత్రాలలో ఒకటి. ఇలాంటి పుణ్యక్షేత్రాల్లో అధిక ధరల విక్రయాలు భక్తులను నిరుత్సాహ పరుస్తున్నాయి. ఆలయ ప్రతిష్టను కాపాడాలంటే అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## యూరియా బ్లాక్ మార్కెట్లో అమ్మితే కఠిన చర్యలు

**కమాన్‌పూర్,తెలంగాణ దిశ :**యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్, ఇన్ఫోసిమెంట్ సీఐ వరుణ్ ప్రసాద్ హెచ్చరించారు. కమాన్ పూర్ మండల కేంద్రంలో విజిలెన్స్ అండ్ ఇన్ఫోర్స్మెంట్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు చేయడం జరిగింది .ఇట్టి తనిఖీల యందు స్టాక్ రిజిస్టర్స్, భౌతికంగా నిల్వ ఉన్న బస్తాల సంఖ్య మరియు ఈపాస్ మెషిన్ అమ్మకాలను పరిశీలించడం జరిగింది,ఇట్టి తనిఖీలలోఉద్దేశపూర్వక ంగా కృత్రిమ కొరత సృష్టించిన బ్లాక్ మార్కెటింగ్ నిర్వహించిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్స్పెక్టర్ వరుణ్ ప్రసాద్ హెచ్చరించారు. నేడు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తు న్నారని రైతులు తమకు అవసరమైనంత యూరియా మాత్రమే తీసుకెళ్లాలని ఆధారంగా తీసుకెళ్లి ఇండ్లలో పెట్టకూడదని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ వరుణ్ ప్రసాద్ , మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏ ఈ శ్రీకాంత్ , హెడ్ కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సు










**కుత్బుల్లాపూర్, నవంబర్ 18, (తెలంగాణ దిశ) :**యువతను పెడదారి పట్టిస్తున్న మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాచుపల్లి సిఐ సతీష్ కుమార్ పిలుపు నిచ్చారు. సోమవారం రాత్రి నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప వద్ద సేవాలాల్ సేన ప్రధాన రాష్ట్ర కార్యదర్శి రామచంద్రనాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మత్తు పదార్థాల నిర్మూలన అవగాహన సదస్సుకు సిఐ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...
నేటి యువత గంజాయి, కొకయిన్, డ్రగ్స్, మద్యం లాంటి మత్తు పదార్థాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తెలిసి తెలియని వయసులో మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు.
పరిసర ప్రాంతాలలో మత్తు పదార్థాల క్రయ విక్రయాలను జరిపే వారిని కఠినంగా శిక్షిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమాన్ని సేవాలాల్ సేన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు నాయక్, రామచంద్రనాయక్ ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో సేవలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వక్తలు, స్థానిక బస్తీల పెద్దలు ప్రసంగించారు. పెద్ద సంఖ్యలో స్థానికులు కార్యక్రమానికి హాజరయ్యారు.

## ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు సైతం ప్రాధాన్యత కల్పిస్తుంది: ఎమ్మెల్యే గండ్ర





జయశంకర్ భూపాలపల్లి: క్రీడలు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా,శారీరక దృఢత్వానికి దోహదపడతాయని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఐడిఓసి కార్యాలయలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగాపాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికిపూల మాలలు వేసి నివాళులు అర్పించి, ఆయన మాట్లాడుతూ దేశానికి గర్వకారణమైన హాకీ ఆటగాడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని దేశ వ్యాప్తంగా జాతీయ
క్రీడా దినోత్సవంగా జరుపుకు ంటమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు సైతం ప్రాధాన్యత కల్పిస్తూ క్రీడా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందని అన్నారు. క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం అన్ని జిల్లా కేంద్రాలలో క్రీడా మైదానాల ఏర్పాటు మొదలు పెట్టడం జరిగిందని అన్నారు.
యువత మత్తు పదార్థాలకు ఇతర వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరచాలని సూచి ంచారు. జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం నిర్మాణానికి 6 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. మండల కేంద్రాలలో కూడా క్రీడా మైదానాల ఏర్పాటుకు కృషి
చేస్తామని తెలిపారు. క్రీడాకారులు క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు తద్వారా మన రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం క్రీడలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు, క్రీడాభిమానులకు జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలియచేశారు.

## విశాఖలో గూగుల్ డేటా సెంటర్




**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ప్రముఖ దిగ్గజ సంస్థ గూగుల్ ఇప్పుడు వైజాగ్‌లో నూ అడుగుపెట్టనుంది. సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. అంతేనా.. ఆసియా ఖండంలోనే ఇది అతిపెద్ద హైపర్‌స్కేల్ డేటా సెంటర్ కానుంది. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల ఏర్పాటు చేసే అతిపెద్ద కేంద్రానికి సైతం విశాఖ వేదిక కానుంది. ఈ మేరకు గూగుల్‌కు చెందిన ఇన్వెస్ట్ ఇండియా ఎక్స్‌లో వెల్లడించింది. గూగుల్ ప్రతిపాదన గేమ్ ఛేంజర్ కానుంది. ప్రపంచానికి డిజిటల్ హబ్‌గా దేశానికి గుర్తింపు వస్తుందని జాతీయ పెట్టుబడుల ప్రోత్సాహక, సమన్వయ సంస్థ ఇన్వెస్ట్ ఇండియా తన ప్రకటనలో పేర్కొంది. ఇన్వెస్ట్ ఇండియా ప్రకటనలో ఇప్పుడు యావత్ ప్రపంచం ఫోకస్ ఏపీపై నిలిచింది. గూగుల్ క్లౌడ్, సెర్చ్, యూట్యూబ్, ఏఐ వర్క్‌ల పర్యావరణ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ఈ డేటా సెంటర్ ఉపయోగపడనుంది. అంతేకాకుండా పరిశ్రమలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. విశాఖలో త్వరలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్.. దేశానికి చెందిన మొత్తం డేటా నిల్వ చేయనుంది. దీనివల్ల ఉగ్రమూక చేతిలోకి విలువైన డేటా చేరే అవకాశం తప్పుతుంది. అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్‌ను పెంచేందుకు 3 సబ్ మెరైన్ కేబుల్స్‌కు సరిపడా ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి డేటా సెంటర్‌ను అనుసంధానిస్తుంది. ముంబయిలో గూగుల్‌కు చెందిన పియరింగ్, క్యాచీ సర్వర్లు ఉన్నాయి. అక్కడి నుంచి సముద్ర మార్గంలో కేబుల్ తీసుకోవడం సులువు అవుతుంది. డార్క్ ఫైబర్ ద్వారా తక్కువ ఖర్చుతో తీసుకోవాలని ప్రణాళికలు వేస్తున్నారు. డేటా సెంటర్ కూలింగ్ కోసం పెద్దఎత్తున నీరు అవసరం అవుతుంది. అందుకే డేటా సెంటర్ ఏర్పాటు కోసం గూగుల్ విశాఖ సముద్ర తీరాన్ని ఎంపిక చేసుకుంది. పైగా ఐటీ రంగంలో రూ.2 కోట్ల పెట్టుబడి పెడితే ఒకరికి ఉపాధి లభిస్తుందని అంచనా.




# జ్వరాలపై అశ్రద్ధ వద్దు

గడిచిన కొన్ని రోజులుగా అధిక వర్షాలు, వరదలతో అతలాకుతలమైన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంది. వరద కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలను విష జ్వరాలు చుట్టుముడుతున్నాయి. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. మలేరియా, డెంగీ, డయేరియా, విష జ్వరాలు తదితర వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ప్రతి ఇంట్లో జ్వరపీడితులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. సెప్టెంబర్ నెలాఖరు వరకూ వర్షాకాలంలో వర్షాలు కురుస్తుండటం సహజమే. కానీ అకాల వర్షాలు, విపరీతమైన ఎండలు ఇటీవల కాలంలో కొంత అనారోగ్య వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. ఈనెల రెండో వారంలో కురిసిన వర్షాలతో జన జీవనం అతలాకుతలమైంది. ఈ క్రమంలో ప్రతిఒక్కరూ తమ ఆరోగ్య విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణంలో వచ్చిన మార్పులతో ఈ కాలంలో రోగ నిరోధక శక్తి బలహీనపడుతుంది. ఫ్లూ, దగ్గు జలుబు వంటి ఇతర వైరల్ ఇన్ఫెక్షన్లు రాకుండా అదనపు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ఉత్తమం. ఒక వేళ వస్తే వాటి నుంచి ఉపశమనం పొందే మార్గాలు, చిట్కాలను కూడా తెలుసుకోవటం మంచిది. వర్షాలు కురిసే సమయంలో వైరల్ ఇన్ఫెక్షన్లు, గొంతునొప్పి, దగ్గు, జలుబు లాంటివి సాధారణంగానే వస్తుంటాయి. వీటితోపాటుగా విష జ్వరాలు, ఫ్లూ, కడుపు నొప్పి సమస్యలు వంటి ఇన్ఫెక్షన్లు కూడా వస్తుంటాయి. ఈ కాలంలో వైరల్ ఇన్ఫెక్షన్ అనేది అత్యంత సాధారణ లక్షణం జ్వరం. సాధారణంగా శరీరం ఒక రకమైన బ్యాక్టీరియా లేదా వైరల్ ఇన్ఫెక్షన్‌తో పోరాడటానికి ప్రయత్నిస్తున్నదనే దానికి సంకేతం. ఈ వర్షాకాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లను అరికట్టడంలో సహాయపడే కొన్ని అంశాలను తెలుసుకుందాం.

బ్యాక్టీరియా వ్యాప్తిచెందకుండా : సరైన పరిశుభ్రత పాటించటం వల్ల వర్షాకాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లను నివారించొచ్చు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. తద్వారా బ్యాక్టీరియా వ్యాప్తి చెందకుండా ఉంటుంది. తినే ఆహారమే వైరస్‌లు, ఇన్‌ఫెక్షన్లను కల్గిస్తుంది. అందువల్ల వేడిగా ఉండే మంచి ఆహారాన్నే తీసుకోవాలి. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాన్ని తీసుకోవాలి. అపరిశుభ్ర వాతావరణంలో చాలా సూక్ష్మక్రిములు సంతానోత్పత్తి చేస్తుంటాయి. అందువల్ల పండ్లు, కూరగాయలు తాజావి తినటం ఎంతో మేలు. మిమ్మల్ని మీరు బాగా హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలి. ఇది ఎల్లప్పుడూ మీకు అనుకూలంగా పనిచేస్తుంది. ఆరోగ్యంగా ఉంచుతుంది. వ్యాధులు రాకుండా చేస్తుంది. బరువు తగ్గడానికి సహాయం చేయడంతోపాటుగా హైడ్రేటెట్‌గా ఉండటం జెర్మ్స్, ఇన్ఫెక్షన్లతో పోరాడటంతో సహాయపడుతుంది.

రోగ నిరోధక శక్తీ ముఖ్యమే : ఆరోగ్యకరమైన రోగ నిరోధకశక్తికి మంచి రాత్రి నిద్ర ముఖ్యం. నిద్రను కోల్పోవడం లేదా రోజుకు ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోవటం వల్ల నిద్రలేమికి దారితీయొచ్చు. తద్వారా అలసటతో పాటు మీ శరీరాన్ని బలహీనంగా చేస్తుంది. అంటువ్యాధులు, వైరల్ ఫీవర్‌ను అంటుకునే అవకాశం కూడా చాలా ఉంటుంది.

కలుషిత ఆహార పదార్థాలకు దూరం హైడ్రేటెట్‌గా ఉండటం ఎంత ముఖ్యమో, నీరు స్వచ్ఛంగా, శుభ్రంగా ఉండేలా చూసుకోవటం కూడా అత్యంత ముఖ్యం. వంట చేయటానికి ముందు కూరగాయలు బాగా కడగాలి. పండ్లను తినేముందు శుభ్రంగా కడగాలి. స్ట్రీట్‌ఫుడ్ సాధ్యమైనంత వరకూ తినకుండా ఉండటం మేలు. జలుబు, జ్వరంతోపాటుగా అనారోగ్యంతో ఉన్నప్పుడు తాగునీరు, తినే ఆహారాన్ని పంచుకోవటం చేయరాదు. రోగ నిరోధక శక్తిని పెంచే ఆహారాలను తీసుకోవాలి.

దోమలతో వ్యాప్తి చెందే జ్వరాలు: దోమకాటుకు గురవ్వటం ద్వారానే రక రకాల జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. వాటి నివారణకు కూడా చర్యలు తీసుకోవటం ఉత్తమం. ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటిచుట్టూ, పరిసర ప్రాంతాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వర్షాల వల్ల పరిసరాల్లోని దోమల సంఖ్య బాగా పెరుగుతుంది. వీటివల్ల డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. దోమలు కుట్టకుండా నిండుగా దుస్తులు ధరించాలి. దోమలు రాకుండా ఆపే పిపెల్లెంట్స్ కూడా వాడొచ్చు.

డెంగీ : ఇది ఏడెస్ దోమకాటు వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ దోమలు ఎక్కువగా నిల్వ ఉండే నీటిలో పెరుగుతాయి. వర్షపు నీటి గుంటలు, కూలర్‌లో మిగిలి పోయిన నీరు, పాతటైర్లు, కుండీలు లాంటి వాటిలో ఈ దోమలు నివాసం ఉంటాయి. పగటి పూట ఇవి ఎక్కువగా కుడ తాయి. తీవ్రమైనజ్వరం,తలనొప్పి (ముఖ్యంగా తలముందు భాగం లో), ఒళ్లునొప్పులు, వాంతులు లాంటివి డెంగ్యూ ప్రధాన లక్షణాలు, చర్మమంతా ఎరువు రంగులోకి మారే అవకాశం ఉంది. జ్వరం ఉధృతంగా రావడం, కళ్లు కదిలించలేని స్థితి, కండరాలు, కీళ్లనొప్పులు ఉంటాయి. శరీరంపై ఎర్రటి దద్దుర్లు వస్తాయి. వాంతి వచ్చినట్లు అవుతుంది. నోరుఎండిపోయి దాహంఎక్కువ అవుతుంది. మలేరియా : చలి, వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. తలనొప్పి ఉంటుంది. రోజువిడిచిరోజు జ్వరం వస్తుంది.ఎక్కువగాచెమటలు పడుతుంటాయి.

మెదడువాపు : ఆకస్మికంగా జ్వరం వస్తుంది. విపరీతమైన తలనొప్పివస్తుంది. వాంతులు అవుతాయి. అపస్మారక స్థితిలోకి చేరోవటం, మూర్ఛలక్షణాలు కన్పిస్తాయి.

చికున్‌గున్యా : ఆకస్మికంగా జ్వరం రావటం, తలనొప్పి, కీళ్లనొప్పులు, ఒళ్లు నొప్పులు వస్తుంటాయి.

స్క్రబ్‌టైఫస్ : ఈ జ్వరం తాజాగా బాగా విస్తరిస్తోంది. విపరీమైన జ్వరం, విపరీతమైన నొప్పులు, ప్లేట్‌లెట్లు పడిపోవటం జరుగుతుంది. పైన పేర్కొన్న జ్వరాలకు సంబంధించి డాక్టరు సూచించిన మందులను వాడితే రెండోమూడు రోజుల్లో తగ్గిపోతాయి. డెంగ్యూ, స్క్రబ్‌టైఫస్ రోగాలు తగ్గటానికి కొంచెం సమయం పడుతుంది వర్షాలు–వరదల సమయంలో జ్వరం, జలుబు, గొంతునొప్పి, దగ్గు నుంచి ఆయాసం వంటి సమస్యలు వస్తాయి. వీటినివారణ,అరికట్టడానికి కొన్నిజాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది.

ఇవి పాటించటం మేలు: జ్వరం వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలి. శరీరం డిహైడ్రేషన్‌కు గురికాకుండా సరైన మోతాదులో నీటిని తాగాలి. మంచి ఆహారాన్ని తీసుకోవాలి. రోగికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి. తేలికపాటి ఆహారం ఇవ్వాలి. రోగి ఆందోళనకు గురికాకుండా చూసుకోవాలి. డాక్టర్లు సరైన వైద్య పరీక్షలు చేసి ఇచ్చిన మందులను వాడితే తగ్గిపోతాయి. దోమలు కుట్టకుండా దోమతెరలు, రిపెల్లెంట్లు ఉపయోగించాలి. ఫాస్ట్‌ఫుడ్ జోలికెళ్లకుండా ఉండటమే మంచిది. మాస్క్ ధరించాలి. క్లోరినేషన్ చేసిన, గంజి, పళ్లరసాలు తాగాలి. ఓఆర్ఎస్ ద్రావణాన్ని గంట గంటకు తీసుకోవాలి.

## జాతీయస్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో నాలుగు పథకాలు సాధించిన మందమర్రి పట్టణ యువకుడు




**మందమర్రి,తెలంగాణ దిశ :**జాతీయస్థాయిలో నిర్వహించిన బాడీ బిల్డింగ్ పోటీల్లో మందమర్రి పట్టణానికి చెందిన యువకుడు విష్ణు నాలుగు మెడల్స్ ను సొంతం చేసుకున్నాడు ఈ సందర్భంగా పట్టణ ఎస్సై రాజశేఖర్, జీకే జిమ్ కోచ్ యజమానులను మెడల్ సాధించిన పేగంబరం విష్ణు అభినందిస్తూ సన్మానించారు. ఈ సంద ర్భంగా ఎస్ఐ రాజశే ఖర్ మాట్లాడుతూ.. హైదరాబాదులో జరిగిన జాతీయ స్థాయి ఐసిఎన్ బిల్డింగ్ కేటగిరీలలో జీకే ఫిట్నెస్ హబ్ యూని సెక్స్ జిమ్ ట్రైనర్ విష్ణు నాలుగు పథకాలను సాధించాడని నేటి యువతకు పేగంబరం విష్ణు మార్గదర్శకుడని అన్నారు యువత ఫిజికల్ ఫిట్నెస్ పై దృష్టి సారించాలని భవిష్యత్తులో ఎంతో ఉపయోగప డుతుందని అన్నారు. ఈ సందర్భంగా పథకాల విజేత విష్ణు మాట్లాడుతూ పట్టణంలోని జీకే ఫిట్నెస్ హబ్ యూని సెక్స్ జిమ్ వలననే ఫిట్నెస్ సాధించి బాడీ బిల్డింగ్ లో పథకాలు సాధించాలని అన్నారు.

## ప్రజా సమస్యల కోసం నిరంతర పోరాటం సురవరం కు నివాళి అర్పించిన నేతలు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సురవరం సుధాకర్‌రెడ్డి పనిచేశారని విశ్రాంత సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. వారి ఇబ్బందులపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ– సభ్యుడిగా నివేదికలు ఇచ్చారని గుర్తుచేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులతో కలిసి ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. తనకు కూడా వామపక్ష భావజాలం పట్ల అభిమానం ఉందని పేర్కొన్నారు. సురవరం ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారని కొనియాడారు. రవీంద్రభారతిలో దివంగత సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్య దర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశి వరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు– చేశారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, తమ్మినేని వీరభద్రం, సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రొఫెసర్ హరగోపాల్, గుమ్మడి నర్సయ్య పాల్గొన్నారు. దశాబ్దానికిపైగా సురవరం, తాను కలిసి కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లినట్లు– బీవీ రాఘవులు తెలిపారు. అనేక పోరా టాలు, ఉద్యమాల్లో కలిసి పని చేసినట్లు– వివరించారు. సురవరం గొప్ప ప్రజాస్వామిక వాది అని కొనియాడారు. ఆయన లేని లోటు– పూడ్చలేనిదని పేర్కొన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కమ్యూనిస్టులు ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తాను ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పుడు తొలిసారి సురవరం సుధాకర్‌రెడ్డిని కలిసినట్లు– టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

# టీఆర్ నెంబర్ తో చలాన్లకు చెక్

**నిజామాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధ నలను తప్పనిసరిగా పాటించాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చలాన్లతో పాటు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది. వాహనం రోడ్డుపైకి వచ్చిన తర్వాత ఎప్పుడు, ఎక్కడి నుంచి ప్రమాదం ఎదురవుతుందో ఎవరూ ఊహించలేరు. మనం జాగ్రత్తగా నడిపినా.. ఎదుటి వ్యక్తి అజాగ్రత్తగా నడిపితే ప్రమాదం తప్పదు. ఇలాంటి సంఘటనల్లో ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగుతుంది. అయినప్పటికీ కొంతమంది నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా, ట్రాఫిక్ చలాన్ల నుండి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్‌లను మార్చి మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ట్రిక్స్ వాడటం చట్టవిరుద్ధం మాత్రమే కాకుండా... పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు.తెలంగాణ రాష్ట్రంలో ట్రాఫిక్ పోలీసులు తనిఖీలను పెంచారు. వాహనదారుడు మితిమీరిన వేగంతో వెళ్లడం, సిగ్నల్ జంపింగ్ వంటి తప్పిదాలకు పోలీసులు నేరుగా జరిమానాలు విధిస్తున్నారు. అయితే.. కొంతమంది వాహనదారులు ఈ చలాన్లను తప్పించుకోవడానికి వింత పద్ధతులు అవలంబిస్తున్నారు. వాహన నంబర్ ప్లేట్లను మార్చడం.. వాటిలో నుంచి ఒక అంకె తొలగించడం.. వాటి స్థానంలో రాజకీయ నినాదాలు లేదా నేతల పేర్లు రాయడం లాంటి పనులు చేస్తున్నారు. పట్టుబడినపుడు సమాధానం చెప్పలేక ఇబ్బందులు పడుతున్నారు.ఇక మరికొందరు నంబర్ స్పష్టంగా కనిపించకుండా పేపర్ అంటించడం, మట్టి రాసేయడం, వెనక్కి తిరిగి కాళ్లు పెట్టడం లేదా చేతులు కప్పేయడం వంటి ప్రమాదకర చర్యలకు కూడా వెళ్తున్నారు. ఈ ప్రయత్నాలు చేస్తున్న క్రమంలో వాహనం ఒక్కసారిగా బ్యాలెన్స్ తప్పి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒక నంబర్‌లో సగ భాగం మాత్రమే కనిపించేలా దాచేస్తే పోలీసులు వెతికినా యజమాని ఎవరో కనుక్కోలేని స్థితి వస్తోంది. ఇలాంటి పనులకు పాల్పడుతూ చాలా మంది ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకుంటున్నారు.కొత్త వాహనం కొన్నప్పుడు మొదట తాత్కాలిక టీఆర్ నంబర్ వస్తుంది. నెలలో శాశ్వత రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. కానీ కొందరు ఏళ్ల తరబడి టీఆర్ నంబర్‌తోనే వాడుతున్నారు. ఈ టీఆర్ నంబర్ ద్వారా అయితే చలాన్లు విధించే అవకాశం ఉండదు అనే కారణంగా ఇలాంటి పనులు చేస్తున్నారు. అయితే ఇలాంటి వారిని పోలీసులు గుర్తించినప్పుడు కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల బాన్సువాడలో పెద్ద మోసం బయటపడింది. హైదరాబాద్ నుంచి దొంగతనం చేసిన వాహనాలను తక్కువ ధరకు స్థానికులకు అమ్మేశారు.పత్రాలు లేకపోయినా చవకైన ధరకు వాహనం వస్తుందని నమ్మిన వారు మోసపోయారు. తనిఖీల్లో ఆ వాహనాలు పట్టుబడటంతో పోలీసులు అసలు కథ బయటపెట్టారు. అధికారులు ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ.. పత్రాలు సరిగా లేని వాహనాలు కొనకూడదని సూచించారు. బాన్సువాడ సీఐ అశోక్ మాట్లాడుతూ.. వాహనాల తనిఖీలు కఠినంగా కొనసాగుతున్నాయి.. నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానాలు తప్పవు.. పత్రాలు లేకుంటే వాహనం స్వాధీనం చేసుకుంటాం.. నంబర్ తప్పు అయితే నేరుగా కేసు నమోదు చేస్తా అని స్పష్టం చేశారు. ఎక్కువగా ట్రాఫిక్ చలాన్లు పెండింగ్‌లో ఉంటే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.


# క్లీన్.. గ్రీన్..అండ్ కట్

హైదరాబాద్,: మానవాళి మనుగడకు చెట్లు చాలా ముఖ్యం.. హైదరాబాద్ నగరం కాంక్రీట్ జంగల్ గా మారిపోయింది.. హైదరాబాద్ శివారు ప్రాంతంలో కూడా అభివృద్ధి చెందడంతో అక్కడ కూడా పచ్చని చెట్లు కనుమరుగవుతున్నాయి..కొన్ని ప్రాంతాలలో అభివృద్ధి, రోడ్ల విస్తరణ పేరుతో చెట్లు నరికేస్తున్నారు..ఇప్పుడు ఇక్కడా అదే జరుగుతోంది..నగర శివారు ప్రాంతం? శంషాబాద్ ఎయిర్ పోర్ట్ 44 కర్నూల్ రోడ్డు నుంచి పెద్ద గోల్కొండ సెంటర్ వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. అందుకే రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ఇప్పటికే నగరం కాలుష్యకారకాలతో నరకంగా మారింది. కనీసం శివారు ప్రాంతాలైనా చెట్లతో మంచి ఆరోగ్య వాతావరణంతో కనిపిస్తుండేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండా పోయిందంటున్నారు స్థానికులు. అభివృద్ధి పేరుతో ఇష్టారీతిన ప్రకృతి విధ్వంసం జరుగుతోందని, రోజూ ఈదారిన వెళ్తుంటే?ఆచెట్లు ఎంతో ఆహ్లాదకరంగా కనిపించేవని, చల్లటి గాలిని ఇస్తూ ఆరోగ్యానికి రక్షణ కవచంలా ఉన్న ఈచెట్లు కనుమరుగైపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారుఇంత హడావుడిగా ఎందుకు నరికేస్తున్నారంటే..ఔఱ 44 కర్నూల్ రోడ్డు నుంచి పెద్ద గోల్కొండ సెంటర్ ఏడు కిలోమీటర్ల వరకు రోడ్డు విస్తరణ ఉంది.. 40 అడుగుల ఉన్న రోడ్డును 100 అడుగుల రోడ్డుగా మారుస్తున్నారు..అందుకే ఈనరికివేత. ఓకేఅభివృద్ధి ముఖ్యమే కానీ, చెట్లను కాపాడడం అంతకుమించి ముఖ్యం.. వేసవికాలం, వర్షాకాలంలో చెట్లు మనిషికి ఎంత ఉపయోగపడతాయో అందరికి తెలుసు. అలాంటి చెట్టును నరికితే భవిష్యత్ ఎంత భయంకరంగా ఉంటుందో కూడా తెలుసు అయినా సరే అధికారులు చాలా ఈజీగా నరికేసుకుంటూ పోతున్నారు. చెట్టును తొలగించడం తప్పనిసరైతే..నరకడం కంటే లేటెస్ట్ టెక్నాలజీతో మరోచోట వాటిని తరలించి బతికించొచ్చు కదా అన్నది.నరుకుతున్న చెట్లు ఇప్పటివి కావు. పాతిక ముప్పైఏళ్ల వయసున్నవి. ఇలాంటి చెట్లు పెంచాలంటే మరో పాతికేళ్లు ఆగాలి. కానీ వాటిని చిటికెలో నరికేస్తోంది మన అధికార గణం. చెట్లను నరికేందుకు ఖీఃః డిపార్ట్మెంట్ ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌ను కన్సల్ట్ అయింది. అక్కడ్నుంచి పర్మిషన్ కూడా ఇచ్చారని చెబుతున్నారు అధికారులు.అటవీశాఖ రెండు వైపులా పరిశీలించి ట్రీ ప్రొటెక్షన్ కమిటీకి సిఫార్సు చేశామని. ట్రీ ప్రక్షన్ కమిటీ ఇన్స్పెక్షన్ చేసి ట్రాన్స్ లొకేషన్ ద్వారా చెట్టుని వేరేచోట నాటడం,

రిటెన్షన్ అంటే చెట్టును ఎక్కడ ఉందో అక్కడే ఉంచడం, ట్రీ ఫెల్లింగ్ అంటే చెట్టుని పూర్తిగా తొలగించడం లాంటి వాటికి అనుమతులు కూడా ఇచ్చింది. అయితే కొన్నింటిని ఒకచోటు నుంచి వేరే చోటకి తరలించినా బతకవనీ, అన్నిరకాలుగా చెక్ చేశాకే వీటిని తొలగిస్తున్నామంటోంది అటవీశాఖఅధికారులు అంతా ప్రాపర్‌గానే చేస్తున్నట్టు కనిపిస్తున్నా..ఇక్కడ చూస్తే మొత్తం తొలగిస్తున్నారు

తప్ప, ట్రాన్స్ లొకేషన్ లాంటి చర్యలు అధికారులు తీసుకోవడంలేదంటున్నారు స్థానికులు. ఎంతో ఏపుగా పెరిగిన చెట్లను మరోచోటకు తరలిం చకుండా ఇష్టారీతిన తొలగించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి పేరుతో పృకృతి విధ్వంసం చేస్తే భవిష్యత్ అంతా భయంకరంగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

# అసిడిటీ ఇలా దూరం




ఉరుకుల పరుగుల జీవితంలో పడి.. సమయానికి తినలేకపోతున్నారు. బయటి తిండి, మారుతున్న ఆహారపు అలవాట్లతో.. 'అసిడిటీ' బారినపడుతున్నారు. కడుపులో మంట, కడుపుబ్బరం, హార్ట్‌బర్న్ లాంటి సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇలాంటి సమయంలో కొందరు దుకాణాల్లో దొరికే అసిడిటీ రెగ్యులేటర్లను ఆశ్రయిస్తుంటారు. ఇన్‌స్టంట్ రిలీఫ్ పొందుతుంటారు. అయితే, ఇలా అసిడిటీ రెగ్యులేటర్లను రెగ్యులర్‌గా వాడితే ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసిడిటీ సమస్యలు గతంలోనూ ఉండేవి. కానీ, అప్పటివాళ్లు జీలకర్ర, అల్లం, సోంపు, పెరుగు లాంటివి తీసుకొనేవారు. సహజసిద్ధమైన ఈ ఉత్పత్తులు అసిడిటీని తగ్గించడంతోపాటు ఆరోగ్యానికీ హామీ ఇచ్చేవి. కానీ, ఇప్పుడు కాలం మారింది. ఇప్పటివాళ్లు అప్పటికప్పుడే ఉపశమనం పొందడానికి మార్కెట్లలో లభించే యాంటాసిడ్లను ఆశ్రయిస్తున్నారు. ఇవి కొన్ని నిమిషాల్లోనే కడుపు మంటను తగ్గిస్తాయి. కానీ, కొందరు వీటిని రెగ్యులర్‌గా వాడుతుంటారు. అలాంటి వాళ్లలో.. ఈ అసిడిటీ రెగ్యులేటర్లు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. పేగుల ఆరోగ్యంతోపాటు జీర్ణవ్యవస్థనూ దెబ్బతీస్తాయి. పరిశ్రమలో తయారయ్యే అసిడిటీ రెగ్యులేటర్లలో సిట్రిక్ యాసిడ్, సోడియం బైకార్బొనేట్ లాంటివి కలుపుతారు. ఇవి కడుపులో సహజంగా ఉత్పత్తయ్యే ఆమ్లాలపై ప్రభావం చూపుతాయి. వాటి ఉత్పత్తి తగ్గుతుంది. దీర్ఘకాలంపాటు వాడితే.. జీర్ణ వ్యవస్థ కుంటుపడుతుంది. వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. వీటికి బదులుగా.. సహజసిద్ధమైన యాంటాసిడ్లను వాడటం మంచిదని చెబుతున్నారు. ఆహారం జీర్ణం కావడాన్ని వేగవంతం చేయడంలో.. ఆపిల్ సైడర్ వెనిగర్, అజ్వైన్, అల్లం, రాక్ సాల్ట్ సమర్థంగా పనిచేస్తాయి. భోజనానికి ముందు వీటిని కొద్దిగా తీసుకుంటే.. జీర్ణవ్యవస్థ చురుగ్గా మారుతుంది. ఇక భోజనాన్ని బాగా నమిలి తినడం, చల్లని నీటిని దూరం పెట్టడం కూడా మంచి అలవాటు. కొబ్బరి నీళ్లు, మెంతి నీళ్లతోపాటు హెర్బల్ టీ కూడా.. గ్యాస్, కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తాయి. జీర్ణక్రియను వేగవంతం చేసి.. అసిడిటీని తరిమేస్తాయి.

## లక్ష్మీదేవిపల్లిలో ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

లక్ష్మీదేవిపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల నాయకుల నుంచి అధికారులు అభ్యంతరాలు స్వీకరించారు. ఎంపీడీఓ టి.అంకుబాబు, ఎంపీఓ శ్రీనివాస రావు మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా, మరియు పోలింగ్ స్టేషన్ల ముసాయిదాపై సమావేశంలో చర్చించారు. పోలింగ్ బూత్‌లు, వార్డుల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాను వివరించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలుపాలని కోరారు. ఈ సమా వేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ గౌస్, ఎండీ హస్మర్ ఖాన్, సీపీఐ నుండి లక్ష్మీపతి, సీపీఎం నుండి కోబాల్, బీఆర్ఎస్ నుండి కొట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# అమెరికాకు తగ్గిన భారతీయులు..

## 2001 తర్వాత ఇదే తొలిసారి
## ట్రంప్ సర్కారు నిర్ణయాలే కారణం



వాషింగ్టన్ : అమెరికాలో పర్యటించే భారతీయ సందర్శకుల సంఖ్య తగ్గింది. ఏటా జూన్‌లో అమెరికాకు భారతీయ సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. నిరుడు జూన్‌లో 2.3 లక్షల మంది వెళ్లగా, ఈ ఏడాది జూన్‌లో 2.1 లక్షల మంది వెళ్లారు. అంటే, 8 శాతం తగ్గుదల నమోదైంది. ఈ స్థాయిలో తగ్గుదల నమోదు కావడం ఈ మిలీనియంలో ఇదే తొలిసారి. నిరుడు జూలైలో కన్నా ఈ ఏడాది జూలైలో 5.5 శాతం తగ్గుదల కనిపించింది. ఈ వివరాలను అమెరికా వాణిజ్య శాఖకు చెందిన నేషనల్ ట్రావెల్ అండ్ టూరిజం ఆఫీస్ వెల్లడించింది. మొత్తం మీద చూసినపుడు, కొన్ని నెలల నుంచి అమెరికాకు ఇతర దేశాల నుంచి వెళ్లే సందర్శకులు తగ్గిపోతున్నారు. నిరుడు జూన్‌తో పోల్చుకుంటే, ఈ ఏడాది జూన్‌లో 6.2 శాతం తగ్గిపోయారు. నిరుడు మే నెలలో కన్నా ఈ ఏడాది మే నెలలో 7 శాతం మంది, నిరుడు మార్చితో పోల్చినపుడు ఈ ఏడాది మార్చిలో 8 శాతం మంది, నిరుడు ఫిబ్రవరిలో కన్నా ఈ ఏడాది ఫిబ్రవరిలో 1.9 శాతం మంది అమెరికాకు విదేశీ పర్యాటకులు తగ్గిపోయారు. నిరుడు జనవరితో పోల్చినపుడు ఈ ఏడాది జనవరిలో 4.7 శాతం పెరుగుదల కనిపించింది. నిరుడు ఏప్రిల్‌లో కన్నా ఈ ఏప్రిల్‌లో 1.3 శాతం మంది పెరిగారు.

అమెరికన్ వీసా మరింత భారం: భారత దేశం నుంచి అమెరికాకు వెళ్లే ప్రయాణికులు అక్టోబరు 1 నుంచి వీసా ఇంటెగ్రిటీ రుసుముగా 250 డాలర్లు (సుమారు రూ.22,000)ను చెల్లించవలసి ఉంటుంది. దీంతో మొత్తం వీసా ధర 442 డాలర్లు (సుమారు రూ.38,974) అవుతుంది. ఈ అదనపు భారాన్ని మెక్సికో, అర్జంటైనా, భారత్, బ్రెజిల్, చైనా వంటి నాన్ వీసా వెయివర్ దేశాల నుంచి వెళ్లే ప్రయాణికులు భరించవలసి ఉంటుంది.

హెచ్-1బీ, ఎఫ్-1 వీసాలకు వ్యక్తిగత ఇంటర్వ్యూలు తప్పనిసరి: ఇంటర్వ్యూ వెయివర్ లిస్ట్‌ను అమెరికా సవరించింది. దీంతో నాన్ ఇమిగ్రెంట్స్ సెప్టెంబరు నుంచి తప్పనిసరిగా వ్యక్తిగతంగా ఇమిగ్రేషన్ ఇంటర్వ్యూలకు హాజరుకావలసి ఉంటుంది.

వయసు పద్నాలుగేళ్ల లోపు, 79 ఏళ్లు పైబడిన దరఖాస్తుదారుల్లో అత్యధికులు ఇకపైన వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరుకావలసిందే. వీరికి ఇప్పటి వరకు మినహాయింపు ఉండేది. అయితే, వీసా వెయివర్ లిస్ట్‌లో ఉన్నవారు వ్యక్తిగత ఇంటర్వ్యూకు హాజరుకానవసరం లేదు. కొన్ని రకాల బీ1/బీ2 వీసాహోల్డర్స్ మాత్రమే ఇంటర్వ్యూ వెయివర్ బెనిఫిట్‌కు అర్హులు.

# ఆస్ట్రేలియాలో భారత వ్యతిరేక నిరసనలు!



## వందేండ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కంటే ఐదేండ్లలో వచ్చిన భారతీయులే ఎక్కువని ఆరోపణ
## ప్రతిగా శరణార్థుల రక్షణ సంఘం ర్యాలీ

కాన్‌బెర్రా : ఆస్ట్రేలియాలో వలసదారులకు వ్యతిరేకంగా, ముఖ్యంగా భారతీయులకు వ్యతిరేకంగా ఆదివారం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. 'మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా' పేరుతో నిర్వహించిన ఆందోళనలో నిరసనకారులు ప్రధానంగా భారతీయులను లక్ష్యంగా చేసుకున్నారు. దేశ సాంస్కృతిక నిర్మాణానికి వారు ముప్పుగా మారారని ఆరోపించారు. పెద్దయెత్తున ఉన్న వలసవాదులకు వ్యతిరేకంగా దేశ రాజధాని సిడ్నీ సహా ప్రధాన నగరాలు, పట్టణాలలో ఆందోళన నిర్వహించారు. 5 నుంచి 8 వేల మంది ఆస్ట్రేలియా జాతీయ జెండాలు ధరించి సిడ్నీలో జరిగిన ఆందోళనలో పాల్గొన్నారు. 100 ఏండ్లలో వచ్చిన గ్రీకులు, ఇటాలియన్ల కంటే, ఐదేండ్లలో వచ్చిన భారతీయుల సంఖ్య ఎక్కువగా ఉందని వారు ఆరోపించారు. ఆ ర్యాలీ లక్ష్యం గురించి ఆందోళనకారుల గ్రూప్ వెబ్‌సైట్‌లో వివరించింది. ప్రధాన స్రవంతి రాజకీయ నాయకులు ఎప్పటికీ చేయలేనిది సాధించడం, సామూహిక వలసలను అంతం చేయాలని డిమాండ్ చేయడం తమ ర్యాలీ లక్ష్యం అని నిరసన బృందం శనివారం ఎక్స్‌లో పేర్కొంది. కాగా, నిరసనకారుల ఆందోళనకు ప్రతిగా శరణార్థుల హక్కుల రక్షణ సంఘం పేరుతో కొందరు ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మార్చ్ ఫర్ ఆస్ట్రేలియా తీవ్రవాద ఎజెండాను వారు తీవ్రంగా నిరసించారు. వారి చర్య అసహ్యం, కోపాన్ని కలిగిస్తున్నదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, ఈ నిరసన ప్రదర్శనలను తాము వ్యతిరేకిస్తున్నట్టు కార్మిక శాఖ మంత్రి ముర్రే వాట్ తెలిపారు. వీటిని నియో-నాజీ సంస్థలు నిర్వహించిన, ప్రోత్సహించిన ఉద్యమమని ఆయన వ్యాఖ్యానించారు. విద్వేషాన్ని వ్యాప్తి చేసే, సమాజాన్ని విభజించే ఇలాంటి ఆందోళనలను తాము ప్రోత్సహించబోమని స్పష్టం చేశారు.

# తలనొప్పిగా మారిన యూరియా..?!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాజకీయాలు ఇప్పుడు యూరియా చుట్టూ తిరుగుతున్నాయి. యూరియా సరైన స్థాయిలో సరఫరా కాకపోవడంతో తెలంగాణ రైతులు ఇబ్బంది పడుతున్నారు. కేంద్రం డిమాండ్ కు తగ్గట్టుగా యూరియా సప్లై చేయకపోవడంతో రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. వాస్తవానికి యూరియా సరఫరా చేయడం లేదని బిజెపి పార్లమెంట్ సభ్యుడు చెప్పినప్పటికీ.. గులాబీ పార్టీ మీడియా రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తోంది. తన అనుకూల సోషల్ మీడియా గ్రూపుల ద్వారా ప్రభుత్వం పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఇవేవీ తెలియని రైతులు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం అని చెప్పుకుంటున్నారు.స్థానిక ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో యూరియా కొరతను సాకుగా మార్చుకొని.. ఎన్నికల్లో లబ్ధి పొందాలని భారత రాష్ట్ర సమితి చూస్తోంది. ఇదే అదునుగా ఎరువు కష్టాలకు కారణం రేవంత్ ప్రభుత్వం అని ప్రొజెక్ట్ చేస్తోంది. దానికి తగ్గట్టుగానే కొంతమంది రైతులతో నెగిటివ్ కామెంట్స్ చేయించి సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేయిస్తున్నది.. దురదృష్టవషత్తు ఇలాంటి



ప్రచారానికి అడ్డుకట్ట వేసి.. గట్టి కౌంటర్లు ఇవ్వాల్సిన అధికార పార్టీ సోషల్ మీడియా నిశ్శబ్దంగా ఉండిపోయింది. భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా చేస్తున్న ప్రచారాన్ని ఎండ కట్టడంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విఫలం అవుతూనే ఉంది. ఆ పార్టీ సోషల్ మీడియా ఎప్పటికీ మేల్కొంటుంది.. ఎప్పుడు గట్టి కౌంటర్లు ఇస్తుందో అంతు పట్టకుండా ఉంది.స్థానిక ఎన్నికల ముందు రైతులు పడుతున్న యూరియా కష్టాలు అధికార పార్టీకి ప్రతిబంధకంగా మారుతాయి అని విశ్లేషకులు అంటున్నారు. ఎందుకంటే రైతులకు యూరియా సప్లై చేసింది ఎవరనేది తెలియదు. పైగా తెలంగాణ రాష్ట్రంలో వరి సాగు పెరిగిపోయిన నేపథ్యంలో యూరియా కు విపరీతమైన డిమాండ్ ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి కేంద్రం కావలసిన స్థాయిలో యూరియా సప్లై చేయడం లేదని అధికార పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. అయితే కేవలం తెలంగాణలో మాత్రమే కాదని.. దేశ వ్యాప్తంగా యూరియా కొరత ఉందని బిజెపి నాయకులు అంటున్నారు.

అంతర్జాతీయంగా ఏర్పడిన పరిస్థితుల వల్ల యూరియా కొరత నెలకొందని.. త్వరలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని బిజెపి నాయకులు అంటున్నారు.. అయితే రైతులు మాత్రం యూరియా కోసం ఎదురుచూసి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా రేవంత్ ప్రభుత్వం కేంద్రం మీద ఒత్తిడి తీసుకొచ్చి.. కావలసిన ఎరువులను తెలంగాణకు తీసుకొస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇబ్బంది ఉండదు. ఒకవేళ ఇదే తీరు కొనసాగిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిభంధకం తప్పదు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే కంటే ముందు రేవంత్ ఈ సమస్యను పరిష్కరిస్తే సరిపోతుంది

# అగాథంలోకి రూపాయి

## డాలర్‌తో 61 పైసలు పతనం
## 88.19 ఆల్‌టైం కనిష్ట స్థాయికి చేరిక



ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి వెలవెల పోతోంది. ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ 88 స్థాయిని దాటింది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధుల బయటకు తరలిపోవడం, నెలాఖరు కావడంతో దిగుమతిదారులు డాలర్ల కొనుగోళ్లకు మొగ్గు చూపడం తదితర పరిణామాలు రూపాయి విలువను అగథంలోకి పడేశాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 61 పైసలు పతనమై 88.19కి దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 87.73 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 88.33 అత్యల్ప స్థాయికి పడిపోయింది. ఇంతక్రితం ఫిబ్రవరి 10న ఇంట్రాడేలో 87.95 వద్ద నమోదయ్యింది. ఆగస్టు 5న 87.88 కనిష్ట స్థాయిని తాకింది. ఆ తర్వాత భారీ స్థాయిలో పడిపోవడం ఇదే తొలిసారి. రూపాయి విలువ పతనం అంతర్జాతీయ మార్కెట్‌లో దిగుమతులను భారం చేయనున్నాయి. మరోవైపు విదేశీ చెల్లింపుల భారం పెరగనుంది. అంతిమంగా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరగనుంది. "అమెరికా విధించిన భారీ సుంకాలు భారత వాణిజ్య లోటును పెంచుతాయని ఆందోళన కలిగిస్తున్నాయి. దెబ్బతిన్న దేశీయ మార్కెట్లు, విదేశీ పెట్టుబడిదారుల అమ్మకాలు రూపాయిపై ఒత్తిడిని పెంచుతున్నాయి." అని మిరే అసెట్ షేర్‌ఖాన్‌లోని కరెన్సీ అండ్ కమాడిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనుజ్ చౌధరి పేర్కొన్నారు.

# బురద రాజకీయం షురూ!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా క్లౌడ్ బరస్ట్ జరిగింది. మెదక్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాలు బాగా ఎఫెక్ట్ అయ్యాయి. అయితే నేతలు వరదలోనూ రాజకీయాలను వెతుక్కుంటున్నారు. ప్రభుత్వ వైఫల్యమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన విమర్శలు రాజకీయ పరమైనవేనని చెప్పాలి. ఎందుకంటే ప్రకృతి వైపరీత్యాలను ఎవరూ అడ్డుకోలేరు. అందులోనూ జలప్రళయాన్ని ఎవరూ ఆపలేరు. అధికారంలో కాంగ్రెస్ ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ ఉన్నప్పటికీ సహాయక చర్యలు చేపట్టాలంటే అందుకు అనువైన పరిస్థితులుండాలి. రాజకీయ నేతలు ఎవరూ సహాయక చర్యల్లో పాల్గొనరు. వాళ్లు కేవలం ఆదేశాలు జారీ చేయడం మాత్రమే.. కానీ వరదల్లో చిక్కుకుపోయిన వారిని సురక్షితమైన ప్రాంతాలకు చేర్చేది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది మాత్రమేనని గుర్తుంచుకోవాలి. కానీ అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండానే మెరుపు వరదలు వెళ్లిపోయాయి. అయితే భారీగా పంట నష్టం జరిగింది.బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంఒడిశా వద్ద తీరం దాటడంతో కొంత ఊపిరిపీల్చుకున్నట్లయింది. జాతీయ రహదారులే కొట్టుకుపోయాయి. రైల్వే ట్రాక్ కూడా దెబ్బతినింది. ఇటువంటి పరిస్థితుల్లో రాజకీయాలు మానుకుని బాధితులకు అవసరమైన మేరకు సాయం అందించాల్సిన పరిస్థితుల్లో పార్టీ నేతల రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు ఏవగింపును కలిగిస్తున్నాయంటున్నారు. .. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనూ గోదావరి ఉప్పొంగి భద్రాచలం నీటమునిగింది. మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో కూడా చాలా ఆస్తి నష్టం, పంట నష్టం జరిగింది. నాడు కూడా రాజకీయ నేతలు, మంత్రులు, ముఖ్యమంత్రులు వరద తగ్గిన తర్వాత మాత్రమే ఆ ప్రాంతాల్లో పర్యటించగలిగారు. వారికి భరోసా ఇవ్వగలిగారు. ఇప్పుడైనా జరిగిన పంట నష్టం అంచనా వేసిన తర్వాత రైతులందరికీ సాయం చేయాలని, నష్ట పరిహారం అందించాలని విపక్షాలు కోరడంలో తప్పులేదు. అంతేకాని భారీ వర్షం కురుస్తున్న సమయంలోనే ప్రభుత్వ వైఫల్యం అంటూ ఎక్స్ లో పోస్టులు పెట్టడం ఎంత వరకూ సబబని ప్రశ్నిస్తున్నారు. మానుకుని బాధితులకు తక్షణ సాయం అందించడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

# ఆర్ జి 3 లో 88 శాతం బొగ్గు ఉత్పత్తి

## ఆర్.జి-3 జి.యం సుధాకర్ రావు

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** సింగరేణి సంస్థ ఆర్ జి త్రీ పరిధిలో 88% బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జి ఎం సుధాకర్ రావు తెలిపారు. ఆగస్టు నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.వారు మాట్లాడుతూ ఆగస్టు నెలలో రామగుండం-3 ఏరియాకు నిర్దేశించిన 4.40 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 3.87 లక్షల టన్నులు అనగా 88 శాతం బొగ్గు ఉత్పత్తితో పాటు, నిర్దేశించిన 9.50 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి)వెలికితీత లక్ష్యానికి గాను, 17.90 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 188 శాతం ఓ.బి (మట్టి) వెలికి తీయడం జరిగిందని, అదేవిధంగా 5.23 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనులవారిగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ ఆగస్టు నెలలోఓ.సి.పి-1 గనికి నిర్దేశించిన 2.40 లక్షల టన్నుల లక్ష్యానికి గాను,1.66 లక్షల టన్నులు అనగా 69శాతం, ఓ.సి.పి-2 గనికి నిర్దేశించిన 2.00 లక్షల టన్నుల




లక్ష్యానికి గాను 2.21 లక్షల టన్నులు అనగా 111 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగింద న్నారు. భవిషత్తులో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు. ఉద్యోగులందరూ బాధ్యతాయు తంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించడానికి కృషి చేయాలన్నారు. వర్షకాలానికి అనుగుణంగా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.

# 'ట్రంప్' భారాలతో ఆక్వా కుదేలు



## - ఎకరాకు రూ.40 వేల వరకూ నష్టం

**అమలాపురం,తెలంగాణ దిశ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేసిన ఎగుమతి సుంకాలతో ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం పడింది. గతంలో మూడు శాతం ఉన్న సుంకం ఉండేది. ఆగస్టు ఒకటి నుంచి 25 శాతం, ఆగస్టు 27 నుంచి 50 శాతం పెరిగింది. దీంతో, వ్యాపారులు ధర తగ్గించేయడంతో ఆక్వా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రస్తుతం తగ్గిన ధరల నేపథ్యంలో ఎకరాకు రూ.40 వేల వరకూ నష్టపోయారు. 50 శాతం సుంకం అమలులోకి వచ్చాక నాలుగు రోజుల్లోనే 30 కౌంట్‌పై రూ.60, వంద కౌంట్‌పై రూ.50 ధర పడిపోయింది. 40, 50, 60, 70, 80, 90 కౌంట్లపై రూ.20 ధర తగ్గింది. ధర మరింత తగ్గితే నష్టం తీవ్రంగా నష్టపోతామని ఆక్వా రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అధికారికంగా 60 వేల ఎకరాల్లో, అనధికారికంగా 20 వేల ఎకరాల్లో మొత్తంగా 80 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఆక్వా చెరువులకు అనుసంధానంగా సముద్ర తీర ప్రాంతంలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, హేచరీలు, కోల్డ్ స్టోరీజీలు ఉన్నాయి. వీటన్నింటిపైనా ట్రంపు సుంకాల భారం కనిపిస్తోంది. జిల్లా నుంచి ఎక్కువగా అమెరికా, చైనాలకు రొయ్యల ఎగుమతులు జరుగుతున్నాయి. ఇందులో 60 శాతం వరకూ అమెరికాకే ఎగుమతి అవుతున్నాయి. 30 శాతం చైనాకు, మిగిలిన 10 శాతం ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నట్లు వ్యాపారులు చెప్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఏటా మూడు లక్షల టన్నుల నుంచి నాలుగు లక్షల టన్నుల వరకూ రొయ్యల ఎగుమతి జరుగుతున్నాయి.

సన్న, చిన్నకారు రైతులకు రూ.2 లక్షల వరకూ నష్టం: ట్రంప్ సుంకాల పేరుతో వ్యాపారులు రొయ్యల ధరలను (అన్ని రకాల కౌంట్‌లకు సంబంధించి) రూ.30 నుంచి రూ.60 తగ్గించేశారు. దీనివల్ల రైతులకు ఎకరాకు రూ.40 వేల వరకూ నష్టం వాటిల్లుతోంది. జిల్లాలో కనిష్టంగా మూడు ఎకరాల నుంచి ఆక్వా సాగు చేస్తున్నారు. ఐదెకరాలలోపు పండించే రైతులు, కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. పెరిగిన ఎగుమతి సుంకాల నేపథ్యంలో ప్రస్తుతం వీరు రూ.1.20 లక్షల నుంచి రూ.2 లక్షల వరకూ నష్టపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే తాము ఆక్వా సాగు చేయలేమని వారు చెబుతున్నారు. అమెరికాకు ప్రధానంగా 30 కౌంటు రొయ్యలను మాత్రమే ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ఎగుమతికి పనికి రాని వంద కౌంట్ రొయ్య ధర కూడా వ్యాపారులు తగ్గించేశారని రైతులు వాపోతున్నారు. నెల క్రితం వంద కౌంట్ కేజీ ధర రూ.260 ఉండగా, ప్రస్తుతం రూ.200కే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఎకరాలో రొయ్యల సాగుకు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకూ ఖర్చు అవుతోందని, ప్రసుత్త పరిస్థితుల్లో చేతికి రూ.5 లక్షలు రావడం కూడా గగనంగానే ఉందని వాపోతున్నారు.

# వైసీపీ ఉక్కు రాజకీయం




విశాఖపట్టణం, : ఏ రాష్ట్రంలోనైనా సరే ప్రతిపక్షాలు బలపడేది ప్రజా ఉద్యమాల ద్వారానే. ఇది చాలాసార్లు రుజువైన విషయం. ఏపీలో 2024 తర్వాత విపక్షాలకు కలిసివచ్చిన అలాంటి అంశాలు చాలా తక్కువ. చేసిన కొద్దిపాటి ఉద్యమాలు నిరసనలు రాష్ట్రం మొత్తాన్ని కదిలించే అంశాలు కావు. కొన్ని ముఖ్యమైన అంశాలు అలాంటివి దొరికినా వాటిని విపక్షాలు సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. అలాంటి వాటిలో రాయలసీమ మామిడి రైతుల ఆందోళన, నెల్లూరు జిల్లా కర్రేడులో భూములు కోల్పోతున్న గ్రామస్తుల నిరసన, పెరిగిపోయిన విద్యుత్ బిల్లుల అంశాల వంటివి ముఖ్యం. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై ఇంతవరకు విపక్షాలు కలిసికట్టుగా ముందుకు దిగిన ఉద్యమాలు లేనే లేవు. పోనీ ప్రధాన విపక్షాలుగా భావించే పార్టీలు ఒంటరిగానన్నా ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ఉద్యమానికి దిగాయా అంటే అదీ లేదు. అలాంటి తరుణంలో ప్రధాన విపక్షం వైసీపీకి ఒక ముఖ్యమైన ఆయుధంలా మారే ఛాన్స్ " విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ " అంశం ద్వారా వస్తోంది.'ఆంధ్రుల హక్కు -విశాఖ ఉక్కు' నినాదంతో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్న సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. ఒకపక్క స్టీల్ ప్లాంట్‌ని ఆదుకుంటామని చెబుతున్న కేంద్రం మరోవైపు "పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి" గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని చెబుతోంది. దీంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు కార్మికులలతోపాటు సగటు తెలుగువాడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం అయిపోతుందన్న నమ్మకానికి దగ్గరవుతున్నారు. ప్రతి నెల వీఆర్ఎస్ తీసుకునే ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో పాటు తాజాగా 32విభాగాలను ప్రైవేట్‌పరం చేశారంటూ వస్తున్న వార్తలు ఏళ్ల తరబడి ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగుల నమ్మకంపై దెబ్బకొడుతున్నాయి. అయితే ప్రైవేటు పరం కాకుండా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామంటూ కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించలేకపోతున్నాయి అనేది వాస్తవం అని వామపక్ష నేతలు చెప్తున్నారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు చేస్తున్న పోరాటానికి బలం సరిపోవడం లేదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉద్యమించడానికి విపక్ష వైసిపికి ఇది అద్భుతమైన అవకాశమని ఎనలిస్టులు చెప్తున్నారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లు వారు చెప్పినట్టుగానే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం నెమ్మదించింది. ప్రవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోకపోయినప్పటికీ దానిపై ముందుకు కూడా వెళ్లలేదు. కాబట్టి ఐదేళ్లు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం అనే క్లయిమ్ వైసిపి నేతలు చేసుకుంటున్నారు. ఇప్పుడు దాన్ని ఆధారంగా చేసుకుని స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగులతో కలిసి ఉద్యమించే అవకాశం వైసీపీకి ఉంది. నిజంగా అలా చేస్తే ప్రజల్లో పార్టీ ఇమేజ్ కూడా పెరుగుతోంది. కానీ రాష్ట్రంలో తన ప్రత్యర్థులతో కలిసి ఉన్న బిజెపికి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కేంద్రంలో మద్దతిచ్చిన వింత పరిస్థితి వైసిపిది. చంద్రబాబు, పవన్ పై ఒంటికాలిపై లేచే జగన్మోహన్ రెడ్డి బీజేపీపై అంతే తీవ్రంగా ఈ అంశంపై పోరాడగల ధైర్యం చేస్తారా అనేది రాజకీయవర్గాల్లో చర్చగా మారింది. పోలవరం, అమరావతి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఈ మూడు ప్రస్తుతం ఆంధ్రుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్నవి. అమరావతిపై వైసీపీ ఇప్పటికీ అస్పష్టమైన స్టాండ్ తోటే ఉంది . పోలవరం నిర్మాణాన్ని రివర్స్ టెండరింగ్ పేరుతో ఐదేళ్లు వెనక తీసుకుపోయిందంటూ టిడిపి పదే పదే ఆరోపణలు చేస్తున్నా దానికి సరైన కౌంటర్ వైసీపీ నుంచి రావడం లేదు. ఇక వారికి మిగి లింది వైజాగ్ స్టీల్ ప్లాంట్. కూటమి నేతల అస్పష్ట ప్రకటనల మధ్య స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విపక్షాలు ఉద్యమిస్తే కచ్చితంగా ప్రజలు మద్దతు వారికి ఉంటుంది.

# రామాయంం పట్నం దిశ తిరిగినట్టే

ఒంగోలు, : దేశంలో ఇంధన డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ భారీ ప్రణాళికతో ముందుకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం పోర్టు సమీపంలో ఒక అత్యాధునిక చమురు రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వ రంగ సంస్థ యోచిస్తోంది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను ప్రస్తుతం పరిశీలిస్తోంది.ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి, వినియోగదారు దేశం మనదే. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా చమురు డిమాండ్ 2.5 మిలియన్ బ్యారెల్స్ పెరుగుతుందని అంచనా వేయగా, అందులో కేవలం భారత్‌లోనే రోజుకు 1 మిలియన్ బ్యారెల్స్ డిమాండ్ పెరగనుందని బీపీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ఖన్నా జరిగిన సంస్థ వార్షిక వాటాదారుల సమావేశంలో తెలిపారు.ఈ భారీ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే వ్యూహంలో భాగంగానే బీపీసీఎల్ ఈ కొత్త ప్రాజెక్టును చేపడుతోంది. "భారత్ వృద్ధి సామర్థ్యాన్ని గుర్తించి, ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం పోర్టు సమీపంలో కొత్త రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని బీపీసీఎల్ ఆలోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రాజెక్ట్ పూర్వ కార్యకలాపాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి" అని సంజయ్ ఖన్నా అన్నారు.ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక వివరాలు, సామర్థ్యాన్ని ఆయన వెల్లడించనప్పటికీ, గతంలో సంస్థ యాజమాన్యం ఇచ్చిన సమాచారం ప్రకారం... ఏటా 9 మిలియన్ టన్నుల సామర్థ్యం గల ఈ యూనిట్ నిర్మాణానికి సుమారు రూ.95,000 కోట్లు ఖర్చవుతుం దని అంచనా. ఈ వ్యూహాత్మక పెట్టుబడి బీపీసీఎల్ పెట్రోకెమికల్ వ్యాపార సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు, భారతదేశాన్ని ప్రపంచ రిఫైనింగ్, పెట్రోకెమికల్ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని ఖన్నా వివరించారు.బీపీసీఎల్ రాబోయే 50 ఏళ్ల అవసరాలను తీర్చడానికి 'ప్రాజెక్ట్ ఆస్పైర్'ను చేపట్టింది. ఈ ప్రాజెక్టులో రిఫైనింగ్, మార్కెటింగ్, అప్‌స్ట్రీమ్ రంగాలను బలోపేతం చేయడంతో పాటు, పెట్రోకెమికల్స్, పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయెల్స్, గ్యాస్ రంగాల్లోకి అడుగుపెట్టనుంది. "ఇది కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు, భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక సరికొత్త ఆలోచన" అని ఆయన పేర్కొన్నారు.50 ఏళ్ల క్రితం కేవలం 3.8 మిలియన్ టన్నుల ముడి చమురును పెట్రోల్, డీజిల్‌గా మార్చే ఒకే ఒక రిఫైనరీతో ప్రారంభమైన బీపీసీఎల్, ఇప్పుడు 40.5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో మూడు రిఫైనరీలను కలిగి ఉంది. 50 ఏళ్ల క్రితం 3.6 మిలియన్ టన్నుల ఉత్పత్తులను విక్రయించిన సంస్థ, ఇప్పుడు 52.4 మిలియన్ టన్నులకు పైగా పెట్రోలియం ఉత్పత్తులను అందిస్తోంది. "అప్పట్లో మా టర్నోవర్ రూ.552 కోట్లు, లాభం రూ.1.7 కోట్లు. ఇప్పుడు టర్నోవర్ రూ.5 లక్షల కోట్లు దాటగా, లాభం రూ.13,275 కోట్లకు చేరింది" అని ఆయన తెలిపారు.2040 నాటికి నెట్ జీరో ఉద్గారాలు సాధించాలని బీపీసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, 2035 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన పోర్ట్‌ఫోలియోను నిర్మించాలని యోచిస్తోంది. ప్రస్తుతం సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టుల ద్వారా దాదాపు 155 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 71 మెగావాట్ల సోలార్ ప్లాంట్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో 50 మెగావాట్ల రెండు విండ్ ఫారాల వంటి ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి.పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల కోసం సింగపూర్‌కు చెందిన సెంబ్‌కార్ప్ గ్రీన్ హైడ్రోజన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో బీపీసీఎల్ ఒక జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసుకుంది. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో, బీనా రిఫైనరీ వద్ద 5 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ యూనిట్‌ను ప్రారంభించింది. హైడ్రోజన్‌తో నడిచే బస్సులు, వీటీఓఎల్ విమానాల వంటి అత్యాధునిక ఆవిష్కరణలను కూడా సంస్థ అన్వేషిస్తోందని ఆయన తెలిపారు.



# భూసమస్యలను కాలయాపన లేకుండా త్వరగా పరిష్కరించాలి

**గుట్టలు గుట్టలుగా దరఖాస్తులు అరకొరగా పరిస్కారమా?**

**అన్నం పెట్టె అన్నదాతలను అరిగోసపెట్టకండి**

**జిల్లా అదనపు కలేక్టర్ ని కోరిన మద్దెల దినేష్**



రామగుండం:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రేవన్యూ సదస్సులో జిల్లాలో చాలా మంది రైతులు వివిధ రకాల భూ సమస్యల పరిష్కారం కోసం మీ సేవలలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సుల్లో, జిల్లా కేంద్రంలోని, మరియు స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయాలలో గత కొన్ని సంవత్సరాలుగా దరఖాస్తులు చేసుకున్న ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం కావడంలేదని ఫైట్ ఫర్ బెటర్ సోసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఛాంబర్ లోని ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణు గారిని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. అనంతరం మద్దెల దినేష్ మాట్లాడుతూ భూసమస్యలు పరిష్కారం కోసం బాధితులు వారి కుటుంబ సభ్యులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, జిల్లా కలెక్టర్, స్థానిక మండలాల తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతూ ఆర్థికంగా, మానసికంగా, శారీరకంగా అనేక విధాలుగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం గొప్పగా ప్రచారం చేసి రైతంగం సమస్యలు పరిష్కరస్తామని గొప్పలు చెప్పడం జరిగిందని, గత ప్రభుత్వం ధరణి చట్టం వల్ల సరైన ఆప్షన్స్ లేక కబ్జా లో ఉన్న వారికి పట్టా పాస్ బుక్ లేక పోవడం, వారసులు మరణించిన వారి భూములను కూడా వారి కుటుంబ సభ్యుల పేర్ల పై క్రమబద్ధీకరణ చేయకపోవడం, భూమి ఎక్కువగా ఉంటే తక్కువగా, తక్కువగా ఉంటే ఎక్కువగా ఉండడం లాంటివి నమోదైనాయని, అలాగే గతంలో కొనుగోలు చేసిన భూములు పట్టా పాస్ బుక్ లలో అసైన్డ్ భూములని పడడం జరిగిందని, ఇలాంటివి భూ భారతి చట్టం ద్వారా అర్హులైన రైతులకు సవరణ చేస్తారనుకుంటే అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, దాని వల్ల రేవన్యూ సదస్సులు ఉపయోగం లేకుండా పోయిందని, అలాగే జిల్లాలో కొన్ని గ్రామాల్లో రాజకీయ నాయకుల, కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండలతో బ్రతుకు తెరువు కోసం ఇతర ప్రాంతాలకు వలస వచ్చిన వారి భూములను అక్రమంగా ఆర్ఓఆర్ చేయించుకొని రైతు బంధు తో పాటు ఇతర ప్రభుత్వ పథకాలను అక్రమంగా పొందుతూ వలస పోయిన వారికి అన్యాయం జరిగిందని, జిల్లాలో ఇంకా అనేక రకాల భూసమస్యల పరిష్కారానికి నోచుకోక బాధితులు ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూసమస్యలను సులభంగా పరిష్కారం చేయాలనే ఆలోచనతో మేధావులతో చర్చించి భూభారతి చట్టం ప్రవేశపెట్టి దాని ప్రకారం బాధితులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకుని నెలలు గడిచినా ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రభుత్వం ఏమో భారీగా ప్రచారం చేస్తూ లోపు భూసమస్యల ను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, పరిష్కారం చేయలేదని దీని వల్ల భూసమస్యల బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. కావున జిల్లాలో ఉన్న ప్రతి భూసమస్యలను పరిష్కరించాలని, వాటి కోసం స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని మీ ద్వారా వారికి న్యాయం చేయాలని కోరామని తెలిపారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడుతలలో 605 మండలాలో 10,889 రేవన్యూ సదస్సులు జరగ్గ 8,27,330 దరఖాస్తులు వచ్చాయాని సమాచారం, ఇందులో కేవలం 8.53 శాతం దరఖాస్తులనే అమోదించారని, ఇందులో ఆన్లైన్ లో నమోదు చేసిన దరఖాస్తులు 2.52 శాతమే ఉన్నాయని సమాచారం ఇక పెద్దపల్లి జిల్లాలో చూసుకుంటే వాటిని బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. అన్నం పెట్టె అన్నదాతలను అరిగోస పెట్టకుండా రైతుల సమస్యలను పరిష్కరించాలని దినేష్ ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు.

# భాగ్యనగరానికి బీచ్..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన చారిత్రక కట్టడాలు, సంస్కృతికి హైదరాబాద్ ప్రసిద్ధి చెందింది. అయితే, సముద్ర తీరం లేకపోవడంతో బీచ్ అనుభూతిని పొందాలంటే నగరవాసులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఇకపై ఆ అవసరం లేదు. ముత్యాల నగరానికి త్వరలో కృ త్రిమ బీచ్ అందాలు తోడవ్వబోతున్నాయి.ఈ కృత్రిమ బీచ్‌ను నిజమైన బీచ్‌కు ఏమాత్రం తగ్గకుండా రూపొందించనున్నారు. ఇక్కడ సందర్శకుల కోసం అనేక ఆకర్షణీయమైన ఏర్పాట్లు చేయబోతున్నా రు. జల విలాసాలు... ఈ ప్రాజెక్టులో ము ఖ్యంగా ఆకట్టుకునే అంశం నీటిపై తేలియాడే విల్లాలు. వీటితో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు కూడా ఏర్పాటు చేస్తారు. సాహస క్రీడలు... థ్రిల్ కోరుకునే వారి కోసం బంగీ జంపింగ్, స్కేటింగ్, సెయిలింగ్ వంటి సాహస క్రీడలు అందుబాటులో ఉంటాయి.వీటికి తోడు ప్రత్యేకంగా వింటర్ స్పోర్ట్స్‌ను కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. కుటుంబ వినోదం... కుటుంబంతో కలిసి ఆనందించేందుకు వీలుగా పార్కులు, పిల్లల ఆట స్థలా లు, సైక్లింగ్ జోన్లు, జాగింగ్ ట్రాక్లు ఉంటా యి. అదనపు ఆకర్షణలు.. ఫుడ్ కోర్టులు, థియేటర్లు, అలంకార ఫౌంటెన్లు, వేవ్ పూల్స్ వంటి విశ్రాంతి స్థలాలు సందర్శకులను కట్టిపడేస్తాయి. అన్ని రకాల సదుపాయాలతో ఇది కేవలం ఒక బీచ్గా కాకుండా, ఒక సంపూర్ణ వినోద కేంద్రంగా మారబోతోంది.ఔటర్ రింగ్ రోడ్కు సమీపంలో ఉండటంతో నగరంలో ఎక్కడి నుంచైనా సులభంగా చేరుకునే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయి తే హైదరాబాద్ పర్యాటక రంగంలో కొత్త అధ్యాయం మొదలవుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.హైదరాబాద్‌లో మొట్టమొదటి అర్టిఫిషియల్ బీచ్ ఈ ఏడాది డిసెంబర్‌లో కొత్వాల్ గూడ వద్ద ప్రారంభం కానుంది. రూ.225 కోట్ల బడ్జెట్‌తో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంలో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్, సముద్ర తీర అనుభవాన్ని అందించే మానవ నిర్మిత సరస్సు. ఇక్కడ అడ్వెంచర్ స్పోర్ట్స్, ఫ్లోటింగ్ విల్లాస్, వేవ్ పూల్స్ వంటి సౌకర్యాలతో నగరవాసులకు వారాంతపు వినోదాన్ని అందించనుంది.సుమారు 35 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న ఈ అర్టిఫిషియల్ బీచ్, సముద్ర తీరాన్ని పోలిన అనుభవాన్ని అందించేలా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ డీపీఆర్ ఇప్పటికే సిద్ధమైంది. అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్‌టీడీసీ) ఛైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర టూరిజం రంగంలో కీలకమైన అడుగుగా చెబుతున్నారు. ఈ అర్టిఫిషియల్ బీచ్ కేవలం ఇసుక, నీటితో మాత్రమే పరిమితం కాదు. ఇందులో ఫ్లోటింగ్ విల్లాస్, స్టార్-కేటగిరీ హోటళ్లు, వేవ్ పూల్స్, ఫుడ్ కోర్టులు, థియేట్రికల్ వేదికలు, డెకరేటివ్ ఫౌంటైన్స్, పార్కులు, సైక్లింగ్ ట్రాక్‌లు, స్కేటింగ్, బంజీ జంపింగ్, సెయిలింగ్, సిమ్యులేటెడ్ వింటర్ స్పోర్ట్స్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఈ సౌకర్యాలు కుటుంబాలకు ఒక రోజంతా ఆనందించే అనుభవాన్ని అందించేలా సిద్ధం చేస్తారు. తెలంగాణలో టూరిజం రూ. 15,000 కోట్ల స్థాయిలో ఉంది. ఈ అర్టిఫిషియల్ బీచ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఒక ఆకర్షణీయ గమ్యస్థానంగా మార్చడానికి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ నగరవాసులకు నగరం వెలుపల ప్రయాణం చేయకుండానే వారాంత వినోదాన్ని అందించడంతో పాటు, హైదరాబాద్‌ను ఒక డైనమిక్ అర్బన్ రిట్రీట్‌గా రూపొందించనుంది.

## అసిఫ్ నగర్ పిఎస్ హెచ్ఎం ఉద్యోగ విరమణ సన్మానం



**కరీంనగర్,తెలంగాణ దిశ:**ఎంపీపీఎస్అసిఫ్ నగర్‌పిఎస్ హెచ్ఎం చేన్నమనేని ఆంజనేయరావు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికిటి పి టి ఎఫ్ జిల్లా శాఖ తరపున ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జంకె రామచంద్రారెడ్డి మాట్లాడు తూ... ఆంజనేయరావు 29 సంవత్స రాల సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులకు విద్యా రంగానికి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల బాలయ్య, రాష్ట్ర కౌన్సిలర్ కోలుగూరి కిషన్ రావు, సీనియర్ ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు కోల రాజమల్లు, జిల్లా బాధ్యులు ఆర్. చంద్రశేఖర రావు, ఎన్.బాలయ్య, రాజశేఖర్ రెడ్డి తదితరులు హాజరై సన్మానించారు.

## వివేకా హత్య కేసు, సుగాలి ప్రీతి..

# కేసులను ఛేధించడం ఎలా

**విజయవాడ,తెలంగాణ దిశ :**ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా వాటికి ప్రాణం వచ్చినట్లు అయ్యింది. ముఖ్యంగా అమరావతికి ఊపిరి పోసింది కూటమి ప్రభుత్వం. అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించగలిగింది. అయితే రాష్ట్రంలో సంచలనంగా మారిన వివేకానంద రెడ్డి హత్య కేసు, సుగాలి ప్రీతి హత్య కేసులు కూడా త్వరగా ఛేదించి నిందితులకు శిక్షపడేలా కూటమి ప్రభుత్వం చేస్తుందన్న నమ్మకం కలిగింది. కానీ ఏడాదిన్నర అవుతున్న ఈ రెండు కేసులు కనీస స్థాయిలో కూడా ముందుకు కదలకపోవడం ఇబ్బందికరంగా మారింది. ఈ రెండు కేసులను వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నీరుగార్చిందన్న ఆరోపణలు, అనుమానాలు ఉన్నాయి. కానీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి వీటినే లేవనెత్తింది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రెండు కేసులను తేల్చేస్తామని ప్రకటనలు చేశారు. అందుకే టిడిపి మెడకు వివేకానంద రెడ్డి హత్య కేసు.. జనసేన మేడకు సుగాలి ప్రీతి కేసు చుట్టుకున్నాయి. వాటిని తేల్చకపోతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ఆ రెండు పార్టీలు మూల్యం చెల్లించుకోవడం తప్పదువైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు సంచలనంగా మారింది. గుండెపోటు, నారా సుర రక్త చరిత్ర, సిబిఐ అంటూ రకరకాలుగా వైసిపి దారులు మళ్లించింది. కానీ ఆ గొడ్డలి వేటు రక్తపు మరకలు మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు చూపించాయి. ఈ హత్య ఆరోపణలన్నీ వైఎస్ కుటుంబ సభ్యులు చుట్టే తిరిగాయి. అవినాష్ రెడ్డి నేరస్తుడు అంటూ వివేక కుమార్తె సునీత, జగన్ సోదరి షర్మిల టార్గెట్ చేశారు. అందుకు తగ్గ ప్రాథమిక ఆధారాలను కూడా బయటపెట్టారు. అయినా సరే వైసీపీ హయాంలో కేసు విచారణ అడుగు ముందుకు పడలేదు. అవినాష్ రెడ్డి చుట్టూ జగన్ వలయంగా ఏర్పడి కాపాడగలిగారు అన్నది బహిరంగ రహస్యం.వివేకా కేసులో సునీతకు న్యాయం జరగాలి.. హూ కిల్డ్ బాబాయ్ అన్న ప్రశ్నకు జవాబు చెప్పాలి అంటూ గత ఐదేళ్లలో తెలుగుదేశం పార్టీ భారీ స్లోగన్ ఇచ్చింది. జగన్మోహన్ రెడ్డితో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు ఎక్కు పెట్టింది. దోషులకు కొమ్ముకాస్తున్నారంటూ జగన్ పై నేరుగా టిడిపి కార్యకర్తల నుంచి నేతల వరకు విమర్శలు చేస్తూనే వచ్చారు. కానీ కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర సమీపిస్తుంది. ఇంకా వివేకా కేసు విషయంలో అసలు వాస్తవాలు బయటకు రావడం లేదు. సునీత ఆరోపిస్తున్న వ్యక్తులు ధైర్యంగా తిరగ గలుగుతున్నారు. వివేకా కుమార్తె సునీత పోరాటానికి ఫలితం దక్కలేదు. కానీ వైసీపీ హయాంలో సునీతతో పాటు ఆమె భర్తపై పెట్టిన కేసులను మాత్రం కోర్టు కొట్టి వేయడం ఉపశమనం. అంతకుమించి ఈ కేసు ముందుకు సాగలేదు. అధికారుల సైతం ఈ కేసు విచారణ పూర్తయిందని కోర్టుకు నివేదించారు. ఈ మొత్తం ఎపిసోడ్లో ఇంకా గందరగోళం నడుస్తోంది.ఇదిలా ఉంటే సుగాలి ప్రీతికేసు జనసేన మేడకు చుట్టుకుంది. 14 సంవత్సరాల గిరిజన బాలికను దారుణంగా హత్య చేశారు. చేయకూడని పని చేసి మట్టుపెట్టారు.

ఈ కేసు ఏపీలో సంచలనంగా మారింది. అయితే ఈ కేసు మూలాలను, సాక్షాలను వైసిపి ప్రభుత్వం తుడిచేసింది అని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారుపవన్ కళ్యాణ్. సుగాలి ప్రీతి హత్యకు గాను ఆమె కుటుం బానికి న్యాయం చేయాలని.. వారి పోరాటాలకు ఫలితం దక్కాలి అంటూ నాడు వైసిపి ప్రభుత్వ హయాంలో పవన్ హీరో చిత పోరాటం చేశారు. దీంతో ఈ కేసు బాధ్యత జనసేనపై పడింది. కూటమిలో కీలక భాగస్వామిగా ఉండడంతో ఇప్పుడు పవన్ ఈ కేసును తేల్చాల్సి వస్తోంది. సుగాలి తల్లి నేరుగా పవన్ పై ఇప్పుడు విమర్శలు చేయడంతో ఆయన స్పందించాల్సి వచ్చింది.

జనసేన పోరాట ఫలితం మూలంగానే ఆ కుటుంబానికి న్యాయం జరిగిందని.. కానీ సుగాలి ప్రీతి కేసు లో నిందితులకు శిక్ష పడితేనే అసలు న్యాయం జరిగినట్టని పవన్ కళ్యాణ్ చెప్పారు. అయితే ఈ రెండు కేసులను టిడిపి కూటమి తేలిగ్గా తీసుకుంటే మాత్రం ఇబ్బందికరమే.ఈ రెండు కేసులలో అసలు దోషులు ఎవరు? అనేది నిరూపించ లేకపోతే టిడిపి కూటమికి ఇబ్బందికరమే. నిరూపించ గలిగితే మాత్రం వైసీపీ అరాచకానికి ఫుల్ స్టాప్ పెట్టిన వాళ్ళు అవుతారు.

## బదిలీపై వెలుతున్న జెడికి వీడ్కోలు..

## కొత్త జెడికి స్వాగతం పలికిన యాదవులు

పెద్దపల్లి:పెద్దపల్లి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా పనిచేసిన బి.శంకర్ పదోన్నతిపై ఇటీవల మేడ్చల్ జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో విజయ్ భాస్కర్‌బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన శంకర్ ను, నూత నంగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విజయభాస్కర్ ను గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు మేకల మల్లేశం యాదవ్, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం తిరుపతి యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలారపు పర్వతాలు యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాత రాజు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల నరసయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ యాదవ్, పెద్దపల్లి మండల అధ్యక్షులు దాడి చంద్రమౌళి యాదవ్, ధర్మారం మండల అధ్యక్షులు, జంగ మహేందర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

